

నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్రాన్సిట్ హాల్టు

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ సోమవారం విశాఖ విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగనున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం గుర్ల మండలంలో డయేరియా మృతు ల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం 8.35 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడి నుంచి 9.35 గంటలకు బయలుదేరి రోడ్డు మార్గాన విజయనగరం జిల్లా వెళతారు. తిరిగి మధ్యాహ్నం 3.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, విమానంలో గన్నవరం వెళతారు.

100 రోజుల ప్రణాళిక

- నేటి నుంచి పదో తరగతి విద్యార్థులకు అమలు
- రోజుకు ఒక సబ్జెక్టులో ఒక పాఠ్యాంశంపై పరీక్ష
- విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేందుకు వీలుగా ప్రక్రియ
- జిల్లాలో 471 పాఠశాలలు, 32,198 మంది విద్యార్థులు

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): **వచ్చే ఏడాది నిర్వహించనున్న పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయడంలో భాగంగా జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు రోజువారీ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఒక సబ్జెక్టులో ఇప్పటికే బోధించిన పాఠ్యాంశంపై 20 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో భాగంగా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళిక రూపొందించిన విద్యాశాఖ సోమవారం నుంచి అమలుచేయనుంది.**

జిల్లాలో 108 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 10,538 మంది, 363 ప్రైవేటు యాజమాన్య పాఠశాలలో 21,660 మంది మొత్తం 471 పాఠశాలల్లో 32,189 మంది పదోతరగతి చదువుతున్న విద్యార్థులున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదోతరగతి సిలబస్ మారిన నేపథ్యంలో ప్రశ్నపత్రం మార్పుచేశారు. ఈ నేపథ్యంలో పబ్లిక్ పరీక్షలకు అనుగుణంగా రూపొందించిన ప్రశ్నపత్రాలతో పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. సోమవారం నుంచి 100 రోజులపాటు

... మిగతా 6వ పేజీలో



పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకే..



వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు 100 రోజుల ప్రణాళిక అమలుచేస్తున్నాం. పదోతరగతి చదివే ప్రతి విద్యార్థీ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయి. తక్కువ సామర్థ్యం ఉన్న విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. ప్రణాళిక అమలుతోపాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. - ఎల్.చంద్రకళ, జిల్లా విద్యాశాఖాధికారి

భవనాల అన్వేషణలో టీసీఎస్!

- రుషికొండలో మిలీనియం టవర్ లేదా ప్రైవేటు భవనాలపై దృష్టి



మిలీనియం టవర్

- దశలవారీగా ఉద్యోగ నియామకాలకు చర్యలు
- కార్యకలాపాల ప్రారంభానికి శరవేగంగా అడుగులు
- త్వరలో నగరానికి రానున్న ఉన్నతస్థాయి బృందం

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):
విశాఖపట్నంలో క్యాంపస్ ఏర్పాటు చేయాలని ముందుకు వచ్చిన టీసీఎస్ త్వరలో కార్యకలాపాలు ప్రారంభించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగానే 100 రోజుల్లో టీసీఎస్ క్యాంపస్‌కు శంకుస్థాపన చేస్తామని ఐటీ, మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఇప్పటికిప్పుడు సొంత భవనాలు ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాదని, అందువల్ల ప్రస్తుతం రుషికొండ ఐటీ హిల్స్‌లో ఉన్న మిలీనియం టవర్‌లో ఖాళీగా ఉన్న భవనాలు తీసుకోవాలా? లేదా ప్రైవేటు భవనాలు అద్దెకు తీసుకోవాలా ?అన్నదానిపై టీసీఎస్ ఆలోచన చేస్తోందని సమాచారం. టీసీఎస్ క్యాంపస్ రాబోతుందని మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన వెంటనే భవనాల వేటకు సంబంధించి కంపెనీ ప్రతినిధులు చర్యలు ప్రారంభించారని తెలిసింది.

రుషికొండ ఐటీ హిల్స్ రెండు మిలీనియం టవర్స్‌లో ఒక భవనం ఖాళీగా ఉంది. సుమారు మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఈ భవనం టీసీఎస్ కార్యకలాపాలకు సరిపోతుంది. అయితే ఈ భవనం ఉండే ప్రాంతం సెజ్ ఏరియా కావడంతో కొన్ని నిబంధనలు వర్తిస్తాయి. అందువల్ల నగరంలో విశాలంగా ఉండే మూడు భవనాలు పరిశీలించారని చెబుతున్నారు. ప్రస్తుతానికి కనీసం లక్ష చదరపు అడుగుల భవనం అవసరమవుతుంది. విశాఖ

... మిగతా 6వ పేజీలో

కిక్కిరిసిన రైతుబజార్లు

- ఉల్లి, టమాటా కోసం బారులుతీరిన వినియోగదారులు
- ఎంవీపీ రైతుబజారులో ఎనిమిది కౌంటర్లలో విక్రయం
- క్యూలో గంటలకొద్దీ వేచి ఉన్న జనం
- మిగిలిన రైతు బజార్లలోనూ అదే పరిస్థితి

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):
బహిరంగ విపణిలో ఉల్లి, టమాటా ధరలు ఆకాశాన్నంటుతుండడంతో నగర వాసులు రైతుబజార్ల వైపు పరుగుతీస్తున్నారు. సెలవు రోజు కావడంతో ఆదివారం ఎంవీపీ కాలనీ రైతుబజారు జనంతో కిక్కిరిసిపోయింది. ఉల్లి, టమాటా కొనుగోలుకు పెద్దఎత్తున బారులు తీరారు. వారిని నియంత్రించడం రైతుల ు, రైతుబజారు సిబ్బందికి సాధ్యం కాలేదు. జనం రద్దీ దృష్ట్యా రైతు బజారులో ఉల్లి, టమాటా విక్రయాలకు ఎనిమిదేసి కౌంటర్లు ఏర్పాటుచేసినా రద్దీ తగ్గలేదు. ఆదివారం ఒక్కరోజూ ఎనిమిదిన్నర టన్నుల చొప్పున విక్రయాలు చేపట్టిన సిబ్బంది, ఎవరికి ఎంత కావాలో అంత సరకు విక్రయించారు. బహిరంగ మార్కెట్లో మహారాష్ట్ర ఉల్లి కిలో రూ.70 నుంచి 80 ధర వరకూ పలుకుతుండగా రైతుబజారులో రూ.53 చొప్పున విక్రయిస్తున్నారు. కర్నూలు ఉల్లి రూ.37కు అందుబాటులో ఉంది. అదేవిధంగా టమాటా బహిరంగ మార్కెట్లో కిలో రూ.70 నుంచి 90 వరకూ అమ్ముతుండగా, రైతుబజారులో రూ.47కే అందిస్తున్నారు. కాగా కొందరువ్యాపారులు రైతుబజారులో సరకు కొనుగోలుచేసి, బహిరంగ మార్కెట్లో అమ్ముతున్నారు. దీంతో దీంతో గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ రోజుల్లో కూడా ఉల్లి, టమాటా అందుబాటులో ఉంటుందని, సెలవు రోజుల్లో రద్దీ విపరీతంగా పెరుగుతోందని ఎంవీపీ కాలనీ రైతుబజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్ తెలిపారు. కాగా నగరంలోని మిగిలిన రైతుబజార్లలోనూ ఉల్లి, టమాటా కొనుగోలుకు వినియోగదారులు భారీగా బారులుతీరారు.



ఎంవీపీ రైతుబజారులో ఉల్లిపాయలు, టమాటా కొనుగోలు కోసం బారులుతీరిన జనం

మళ్లీ మొదటికి!

- కొలిక్కిరాని రేషన్ షాపుల విభజన ప్రక్రియ
- కోర్టు స్టేతో ఇప్పటివరకు స్వీకరించిన అభ్యంతరాలు రద్దు
- నేటి నుంచి మరోసారి అభ్యంతరాల స్వీకరణ



విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒక డిపోలో 1200 కార్డులు కంటే ఎక్కువగా ఉంటే విభజించి, మరో డిపో ఏర్పాటు చేసే విభజన ప్రక్రియ మొదటకొచ్చింది. కార్డుల విభజనపై సంబంధిత డీలర్ల నుంచి తీసుకున్న అభ్యంతరాలను రద్దుచేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మరోసారి అభ్యతరాలు స్వీకరించాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో 68 రేషన్ దుకాణాల డీలర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు వీలుగా నోటీసులు జారీచేశారు.

రేషన్ దుకాణాల హేతుబద్ధీకరణకు సన్నాహాలు చేసిన పౌరసరఫరాలశాఖ గత నెలలో విధివిధానాలు ఖరారుచేసింది. దీనిపై అభ్యంతరాలు వెల్లువెత్తడంతో హేతుబద్ధీకరణకు బదులు 1,200 కార్డులు దాటిన డిపోలను విభజించాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా నగరంలో 57, గ్రామీణ మండలాల్లో 11 మొత్తం 68 రేషన్ దుకాణాలకు నోటీసులు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరించారు. విభజనపై రాష్ట్రంలో పలువురు డీలర్లు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో పది రోజుల కిందట స్వీకరించిన అభ్యంతరాలను రద్దుచేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. అదే సమయంలో మరోసారి డీలర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. దీంతో సోమవారం నుంచి జిల్లాలోని 68 మంది డీలర్ల నుంచి అభ్యతరాలు స్వీకరించేందుకు నగర పరిధిలో పౌరసరఫరాల శాఖ అధికారులు, గ్రామీణ ప్రాంతంలో తహసీల్దార్లు నోటీసులు ఇవ్వనున్నారు. వారం రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని, వాటిపై కలెక్టర్ సమక్షంలో నిర్ణయం తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ సూచించింది. దీంతో జిల్లాలో సోమవారం నుంచి నోటీసులు జారీచేసి అభ్యంతరాలు స్వీకరిస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కరరావు తెలిపారు.

23న ఏయూ ఈసీ సమావేశం

- 20 కీలకాంశాలతో సిద్ధమైన ఎజెండా
- వీసీ పోస్టుకు పేరు సిఫార్సుతోపాటు పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశాన్ని ఈ నెల 23న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖకు చెందిన అధికారులకు సమాచారాన్ని అందించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో పలు కీలక నిర్ణ యాలను తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

వర్సిటీకి పూర్తిస్థాయి ఉపకులపతిని నియమించేందుకు ఉన్నత విద్యాశాఖ ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టును ఆశిస్తూ భారీ సంఖ్యలో ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు సెర్చ్ కమిటీని నియమించాల్సి ఉంది. ఈ సెర్చ్ కమిటీ ఏర్పాటుకు సంబంధించి నామినీ పేరును సిఫార్సు చేయాలి. ఈ పేరును ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఫైనల్ చేయాలి. సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తారని చెబుతున్నారు. ఈ నెల 25లోగా నామినీ పేరును పంపించాల్సిందిగా ఇటీవల వర్సిటీకి సర్క్యులర్ వచ్చింది. దానికి అనుగుణంగా ఇప్పటికే కొన్నిపేర్లను వర్సిటీ అధికారులు పరిశీలనలోకి తీసుకున్నారు. వీటిపై సమావేశంలో చర్చించి ఒక పేరును ఖరారు చేయనున్నట్టు చెబుతున్నారు.




దీంతోపాటు వర్సిటీలో కొత్తగా ఏర్పాటు చేయాలని భావిస్తున్న కొన్ని కోర్సులకు సంబంధించి ఈసీ అనుమతిని తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఆయా కోర్సులు, ఫీజుల అంశాన్ని చర్చించనున్నారు. అలాగే వర్సిటీలో వివాదంగా మారుతున్న ఎయిడెడ్ ఫ్యాకల్టీని కొనసాగించడం, లేదా వెనక్కి పంపించే అంశాన్ని ఎజెండాలో చేర్చినట్టు చెబు తున్నారు. కొన్ని హాస్టల్స్‌కు అవసరమైన భవన నిర్మాణాలకు సంబంధించిన అంశాలపైనా చర్చించనున్నారు. గత పాలకులు తీసుకున్న నిర్ణయాలు, విచారణ కమిటీల నియామకానికి సంబంధించిన అంశాలను సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. వీటితోపాటు కొత్త ఈసీ నియామకానికి సంబంధించి ప్రస్తుత సభ్యులకు సూత్రపాయంగా తెలియజేస్తారని చెబు తున్నారు. సుమారు ఏడాది తరువాత జరిగే ఈసీ సమావేశానికి ఉన్నత విద్యాశాఖకు చెందిన అధికారులు వర్సిటీకి వస్తారా..? లేక వర్చువల్‌గా పాల్గొంటారా..? అన్నది తెలియాల్సి ఉంది.

గండిగుండం రోడ్డుకు మోక్షం

- రూ.2 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- నాలుగు పంచాయతీల ప్రజలకు మేలు

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):
ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక, నిధులు లేవనే సాకుతో గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరిన గండిగుండం జంక్షన్ నుంచి భీమన్నదొరపాలెం రోడ్డుకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వంలో మోక్షం లభించింది. పంచాయతీరాజ్‌శాఖ నుంచి రూ.రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో నాలుగు పంచాయతీల ప్రజల కష్టాలు తీరనున్నాయి.



అధ్వానంగా గండిగుండం - భీమన్నదొరపాలెం రోడ్డు

ఆనందపురం మండలంలో జాతీయ రహదారి గండి గుండం జంక్షన్ నుంచి భీమన్నదొరపాలెం వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. విజయనగరం జిల్లా కొత్తవలస వెళ్లేందుకు వాహనదారులు ఈ రోడ్డును వినియోగిస్తారు. రామవరం, కణమాం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఉపయుక్తంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు మరమ్మతులకు నిధులివ్వాలని కోరుతూ ఈ ప్రాంత వాసులు పలుమార్లు ఆందోళనలు చేశారు. అయినా పాలకులు పట్టించుకోలేదు. ఈ రోడ్డులో కొత్తవలసకు వెళ్లే బస్సు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. చివరకు స్థానికులు పలుదఫాలు ట్రాక్టర్లతో గ్రావెల్, క్రషర్ బుగ్గితో గోతులు పూడ్చుకోవాల్సి వచ్చింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించడంతో ఈ రోడ్డుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ నేపథ్యంలో రూ2 కోట్లు మంజూరు చేశారు. త్వరలో పనులు చేపట్టేందుకు అధికారులు నిర్ణయించారని స్థానికులు వెల్లడించారు. రోడ్డు నిర్మిస్తే వాహనదారుల కష్టాలు తీరుతాయని, మండల కేంద్రానికి చేరుకునేందుకు నాలుగు పంచాయతీల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో ఘోరం

- ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీ
- నగరానికి చెందిన తల్లి, కుమారుడు దుర్మరణం
- తండ్రి, మరో కుమారుడికి గాయాలు



ఘటనా స్థలంలో దృశ్యం



మృతులు శ్రీకాంత్, నాగలక్ష్మి

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):
ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు పరస్పరం ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన ఎన్టీఆర్ జిల్లా గరికపాడు కేవీకే సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. మృతులు విశాఖపట్నం వాసులుగా అక్కడి పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన ఇళ్ల నాగవెంకట మల్లికార్జునరావు, ఆయన భార్య నాగలక్ష్మి (55), కుమారులు శ్రీకాంత్ (35), చైతన్య హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల విశాఖపట్నం వచ్చిన వీరు కుటుంబసభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం విజయవాడలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం దుర్గమ్మ దర్శనం చేసుకుని హైదరాబాద్ బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు గరికపాడు కేవీకే సమీపంలోకి

... మిగతా 6వ పేజీలో

ఇదో 'దారి'ద్ర్యం



కేఆర్ఎం కాలనీ మెయిన్ రోడ్డులో ఇలా..



సక్రమంగా పూడ్చని రహదారి

- డ్రైనేజీ పైపులైను కోసం రహదారులపై గోతులు తవ్వి సరిగా పూడ్చని జీవీఎంసీ
- 15, 16వ వార్డుల్లో ఆరు నెలలుగా అవస్థలు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- వర్షం వస్తే నరకయాతన

వెంకోజీపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరు నెలల క్రితం.. సరిగ్గా ఎన్నికల నోటిఫికేషన్ ముందు.. హడావుడిగా భూగర్భ డ్రైనేజీ పైపులైను విస్తరణకు జీవీఎంసీ అధికారులు ప్రధాన రహదారులు, వీధుల్లో గోతులు తవ్వించారు. ఆ గోతులు తవ్విన మట్టితోనే పూడ్చి వదిలేశారు. ఆ తర్వాత అతీగతి లేదు. అంతకుముందు వరకూ సక్రమంగా ఉన్న రహదారులు పైపులైన్ల కోసం తవ్వేయడంతో ఛిద్రమయ్యాయి. దారుల్లో తవ్వకాలు చేపట్టిన జీవీఎంసీ అధికారులు వాటి సరిగా పూడ్చాలన్న విషయమే మరిచారు. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న వర్షం పడినా పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ముఖ్యంగా.. 15, 16వ వార్డుల్లోని పాతవెంకోజీపాలెం, జేఆర్‌నగర్, కేఆర్ఎం కాలనీల్లో గోతులు లేని రహదారి లేకుండా పోయింది. వీధుల నుంచి ప్రధాన రహదారుల వరకు అంతా గుంతలమయంగా మారింది. ఇక నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఈ గోతులలో నీరు నిలబడిపోయి, గోతులు కానరాక వాహన చోదకులు గాయాల పాలవుతున్నారు. ఎక్కువగా ద్విచక్రవాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు అసలు పట్టించుకోవడమే లేదు. 'తవ్వడమే మా పని.. ఆ తర్వాత మాకేం సంబంధం లేదు' అన్నట్టుగా వారి వ్యవహార శైలి ఉంటోందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంత బాధ్యతారాహిత్యం అధికారులకు తగదని మండిపడుతున్నారు.



జేఆర్ నగర్‌లో దారి దుస్థితి

శిథిలావస్థలో గాంధీనగర్ అంగన్‌వాడీ భవనం

ఆరిలోవ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 11వ వార్డులోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకొంది. గోడలు, పై కప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. ఈ కేంద్రానికి సుమారు 50 మంది చిన్నారులు వస్తుంటారు. ఎవరిపై ఎప్పుడు శ్లాబ్ పెచ్చులు పడిపోతాయో అని చిన్నారుల తలితండ్రులు, కేంద్రం సిబ్బంది అనునిత్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రం పరిస్థితి దినదిన గండంలా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. శిథిలావస్థలో ఉన్న ఈ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగక ముందే జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పెచ్చులు ఊడుతున్న పై కప్పు

ఘనంగా సత్యసాయి అవతరణ ప్రకటన దినోత్సవం

పెదవాల్తేరు అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ శ్రీసత్యసాయి అవతార ప్రకటన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ ఆలయంలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని శ్రీసత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు ప్రారంభించారు. పెదవాల్తేరు జంక్షన్, బీచ్ రోడ్డు, శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ ఉషోదయ జంక్షన్ మీదుగా ప్రేమసదన్ మందిరం వరకు ర్యాలీ సాగింది. అనంతరం స్వామివారికి వింజామర సేవ, మంగళహారతి నిర్వహించారు. సిటీ సమితి పరిధిలో ఉన్న సాయికుటుంబ సభ్యులతో మహానగర సంకీర్తన నిర్వహించారు. పెద్దసంఖ్యలో మండళ్ల భక్తులు, సమితి సేవాదళ్ సభ్యులు, యువత, బాలవికాస్, వేదబృందం, భజనగాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

శ్రీసీతారామ సేవా సంఘం స్థలం స్వాధీనంలో అడ్డంకులు

- గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఓ కార్పొరేటర్ జోక్యంతో పోలీసుల రంగప్రవేశం
- స్థలం మాదేనంటున్న సంఘ పెద్దలు


వెంకోజీపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని గవర వీధి శ్రీసీతారామ సేవా సంఘానికి చెందిన వందేళ్ల చరిత్ర కలిగిన నుయ్యితో ఉన్న 3 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకునేదుకు గత నాలుగు నెలల నుంచి సంఘం సభ్యులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో అస్తవ్యస్తంగా ఉన్న స్థలాన్ని శుభ్రం చేస్తూ వచ్చారు. వందేళ్ల క్రితం ఏర్పాటైన ఇక్కడి పెద్ద నుయ్యి పరిసర ప్రాంతాల వారికి నీటిని అందించేది. అప్పట్లో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పైపులైనులను ఏర్పాటు చేసి ఈ నుయ్యి నుంచే మంచినీటి సరఫరా కూడా చేసేది. కాలక్రమేణా నీరు అడుగంటడంతో కొన్నేళ్లుగా నుయ్యి నిరుపయోగంగా మారింది. ఇప్పుడు సంఘం పెద్దలు దీనిపై దృష్టి సారించి నుయ్యిని, నుయ్యికి ఆనుకుని ఉన్న స్థలాన్ని కూడా శుభ్రం చేసి సంఘం అభివృద్ధికి ఉపయోగించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గత నాలుగు నెలల నుంచి స్థలం మాదంటూ వచ్చిన గ్రామస్థులతో చర్చలు జరుపుతూనే ఉన్నారు. చర్చలు ఒక కొలిక్కి రాకపోవడంతో సంఘం పెద్దలు ఆదివారం ఇక్కడ కాంపౌండ్ వాల్‌ను నిర్మించేందుకు సిద్ధమయ్యారు. అయితే గ్రామానికి, సంఘానికి కూడా ఎటువంటి సంబంధం లేని గోపాలపట్నంకు చెందిన ఓ కార్పొరేటర్ స్థలం మాదంటూ వచ్చిన వారితో కుమ్మక్కై పోలీసులను తీసుకువచ్చి పనులను నిలిపివేశారు. ఈ స్థలం ఓ ఒక్కరికి సంబంధించినది కాదని, గ్రామానికి, సంఘానికి సంబంధించినదేనని సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు పేర్కొన్నారు. ఈ విషయంపై తాము రెండు, మూడు రోజుల్లో పోలీసులకు ఫిర్యాదు చేసి, స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.



స్థలం స్వాధీనం చేసుకునే వారిని అడ్డుకుంటున్న పోలీసులు

మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘంలో మహిళలకు ప్రాధాన్యం

- కార్యదర్శి రాంప్రసాద్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా కె.లక్ష్మీపతిరాజు, ప్రధాన కార్యదర్శిగా సైకం రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో జరిగిన సంఘం నూతన కార్యవర్గంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ పి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా బి.కృష్ణమూర్తి,బి.పాండురంగారెడ్డి, వై.కోటేశ్వరమ్మ, పి.అప్పారావు, కె.లతాదాస్, రామ్‌కుమార్; సంయుక్త కార్యదర్శులుగా ఎం.బాపిరాజు, సీహెచ్.జగదీష్, బి.వి.నాగేశ్వరరావు, వై.వెంకటరెడ్డి, ఎం.హరిగోపాల్, వి.నాగ సుందరం, రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎల్.సుశీల, ఎ.వి.భాస్కరరావు,ఎ.వి.వి.వి.ప్రసాద్‌రాజు, భాగ్యలక్ష్మి, మోహన లక్ష్మి నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్, పర్యవేక్షకునిగా జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ సమాఖ్య ప్రతినిధి వికాస్ కరార్ వ్యవహరించారు.ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం కొనసాగే ఐదేళ్ల పదవీ కాలంలో ప్రణాళికబద్ధంగా జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నీలతోపాటు జాతీయ, అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్ నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గంలో మహిళలకు ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. 30 నుంచి 100 మంది వరకు పురుషులు, మహిళలుఉత్సాహంగా పాల్గొంటున్న మాస్టర్ అథ్లెటిక్స్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం అందే విధంగా నూతన కార్యవర్గ సభ్యులంతా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి : సీపీఐ

సీతమ్మధార, అక్టోబరు 29: (ఆంధ్రజ్యోతి) : ప్రజల మీద ఆర్థిక భారాలు, విద్యుత్ టు అఫ్ రద్దు చేయాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సీతమ్మధారలో గల రైతుబజార్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వామనమూర్తి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ప్రజలు వాడే నిత్యావసర వస్తువులు, డీజిల్ పెట్రోల్ ధరలు పెంచారని, దీంతో ప్రజలపై ఆర్థిక భారం పడిందని మండిపడ్డారు. పెంచిన ధరలు తగ్గించి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ధరలు మండుతున్నాయని మండిపడ్డారు. పెరిగిన ధరలు నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పడాలి గోవింద్, రావికృష్ణ, ఎస్.మధురెడ్డి, కె.శివ లక్ష్మణరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నేత వామనమూర్తి తదితరులు



ప్రమాదకరంగా ఉన్న మూతలేని డ్రైనేజీ

ఆదమరిస్తే.. అంతే సంగతులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఏడో సెక్టరులో ఓ చోట డ్రైనేజీ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న డ్రైనేజీపై ఓ చోట మూత లేకుండా వదిలేశారు. దీన్ని ఆనుకుని దుకాణాలు ఉన్నాయి. ఎవరైనా పొరపాటున అందులో పడిపోతే తీవ్ర గాయాల పాలయ్యే పరిస్థితి ఉంది. ఇలాంటి ఉదంతాలు తరచూ ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా.. చిన్న పిల్లలు, వృద్ధులు ఈ డ్రైనేజీలో పడిపోతున్నారని అంటున్నారు.

వర్షం పడే సమయంలో డ్రైనేజీలో నీరు ఎక్కువగా ప్రవహిస్తుంది. కొన్నేళ్ల కిందట కృష్ణా కళాశాల సమీపంలోని డ్రైనేజీలో పడి ఓ చిన్నారి మృత్యువు పాలైన సంఘటన గుర్తు చేస్తున్నారు. ఎన్నాళ్లుగానో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ జీవీఎంసి అధికార గణం పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందే జాగ్రత్త పడడం మంచిదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ డ్రైనేజీపై మూత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్ఎంయూ నేతలతో డీపీటీవో చర్చలు సఫలం

- దీక్ష విరమించిన ఆర్టీసీ కార్మికులు



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న రమణారెడ్డి

పెదవాల్తేరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మజ్దూర్ యూనియన్ విశాఖ జిల్లా కమిటీతో విశాఖ జిల్లా నూతన డీటీపీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎ.అప్పలనాయుడు జరిపిన చర్చలు ఫలించాయి. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ఎన్ఎంయూ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ డీపీటీవో ఎ.అప్పలరాజు హయాంలో ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదని, ఆయన విధానాల వల్ల ఆర్టీసీ నష్టపోయిందని ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి విమర్శించారు. గత 45 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న కార్మిక నేతలకు ఆదివారం ఆయన నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు.

భవనాల అన్వేషణలో టీసీఎస్!

... 5వ పేజీ తరువాయి

క్యాంపస్‌లో 15వేల మంది పనిచేసేలా ప్రతిపాదిస్తున్నారు. అందరినీ ఒకేసారి కాకుండా, దశలవారీగా నియమించుకుని కార్యకలాపాలు చేపట్టనున్నారు. మిలీనియం టవర్‌లో ఒక భవనం, నగరంలో మూడు ప్రైవేటు భవనాల పరిశీలనకు కంపెనీ నుంచి ఉన్నత స్థాయి బృందం వచ్చే అవకాశం ఉందని తెలిసింది. అటు తరువాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకోవడం, సొంత క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని సమాచారం.

ఎన్టీఆర్ జిల్లాలో ఘోరం

... 5వ పేజీ తరువాయి

చేరుకోగా, అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న శ్రీకాంత్‌తో పాటు నాగలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. మల్లికార్జునరావు కుడి కాలు విరిగి పోగా, చైతన్యకు స్వల్పగాయాలయ్యాయి. సీఐ జానకీరాం, చిల్లకల్లు ఎస్ఐ శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



టాస్ వేస్తున్న అచ్యుతరావు

క్రీడలతో యువతలో మనోవికాసం

- ఉపకార చారిటబుల్ ట్రస్టు అధినేత అచ్యుతరావు

ఆరిలోవ అక్టోబరు 20 : యువతలో మనోవికాసాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సినీ నిర్మాత, ఉపకార చారిటబుల్ ట్రస్టు అధినేత కంచెర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. స్థానిక పినాకిల్ మైదానంలో ఆదివారం ఆయన సీజన్-2024 క్రికెట్ టోర్నమెంటును తొలువ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి 24 జట్లు పాల్గొంటున్నట్టు తెలిపారు. యువత పెడతోవ పట్టకుండా ఉండేందుకు కూడా క్రీడలు దోహదపడతాయన్నారు. 29న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.1.20 లక్షలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.60 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు అందించనున్నట్టు తెలిపారు. వచ్చే నెలలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు, సంక్రాంతికి విశాఖ వేదికగా ఆల్ ఇండియా టార్గెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ సుధీర్, రెహ్మాన్, నాగు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గం



సమావేశంలో పాల్గొన్న యాదవ కుల పెద్దలు

మద్దిలపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెం సవేరా ఫంక్షన్ హాలులో ఆదివారం విశాఖ జిల్లా యాదవ సంఘం సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా పల్లా సింహాచలం, అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు, కార్యదర్శి బొట్టా వెంకటరమణ, కోశాధికారిగా పిట్ట సురేష్‌లను ఎన్నుకున్నారు. పరిశీలకులు గొలగాని అప్పారావు, గొంప అప్పారావు, ప్రగడ చిన్నారావు వ్యవహరించారు.

సరస్వతి విగ్రహం ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీచర్లు


ఎంవీపీ కాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీకాలనీ దరి వాసవానిపాలెం ప్రభుత్వ మత్స్యకార పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. నగరానికి చెందిన పొట్నూరు సురేష్ కుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్సు పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సత్యవేణి, స్కూల్ చైర్మన్ పేర్ల భాస్కరరావు, బాబా బజార్ అధినేత రవికుమార్, కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు పీసీబీ రావు, కేశవరావు, శివశంకర్ పాల్గొన్నారు.

ఏ డేట్ లెక్చరర్స్‌ని తక్షణం వెనక్కి పంపాలి

వెంకోజీపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ని ఏయూ జేఏసీ సభ్యులు పర్మినెంట్ ప్రొఫెసర్స్ కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌లు, గెస్ట్ ఫ్యాకల్టీస్, స్కాలర్స్ కలిసి ఏయూలో అక్రమంగా తిష్ట వేసినటువంటి ఏ డేట్ లెక్చరర్స్‌ని తక్షణం వెనక్కి పంపించాలని కోరారు. నవంబరు 12వ తేదీతో ఏ డేట్ లెక్చరర్స్ డిప్యూటేషన్ ముగుస్తుందని, అయితే ఈసీలో పెట్టి వాళ్లని వెనక్కి పంపించవలసిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కానీ ఏయూ యాజమాన్యం మేనవేషాలు లెక్కిస్తూ మాజీ వీసీ ప్రసాదరెడ్డికి కొమ్ముకాస్తు ఉందని మంత్రికి వివరించారు.

దీనిపై స్పందించిన ఏ డేట్ లెక్చరర్స్‌ను పంపించి వేయాలని, లేకుంటే అధికారులపై చర్యలుతీసుకుంటామని, ఇంతకాలం ఎందుకు ఉంచారని ప్రశ్నించినట్టు జేఏసీ సభ్యులు తెలిపారు.

వాణిజ్య పన్నుల శాఖ ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ఆరిలోవ, అక్టోబరు 20 : ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.నాగయ్య, ఉపాధ్యక్షులుగా సర్వసిద్ధి వెంకట వరహాలుబాబు, ఎస్.బేగం, ప్రధాన కార్యదర్శిగా ఎ.టి.వేంకటేశ్వరరావు, కార్యదర్శిగా కె.వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.సింహాచలంనాయుడు, కోశాధికారిగా పి.రామారావులు ఎన్నియ్యారు. ఎన్నిక పరిశీలకులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.గోపాలకృష్ణయ్య, ప్రతినిధులు ఆర్.రామచంద్రప్రసాద్, సీహెచ్ రమణ వ్యవహరించారు.

క్రీడాకారుడు పైడిరాజుకు నివాళి



వెంకోజీపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : తమతో రోజూ ఆడుతూ సరదాగా ఉండే వ్యక్తి అకాల మరణం పొందడం జీర్ణించుకోలేక పోతున్నామని కొత్త వెంకోజీపాలెంలోని గణేష్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పాత వెంకోజీపాలేనికి చెందిన పల్లా పైడిరాజు(47) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి తమకు తీరని లోటని అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆవేదన చెందారు. వీరితో పాటు పాత వెంకోజీపాపాలెం శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు ఒమ్మి ముత్యాలరాజు, ఇతర సంఘం పెద్దలు పైడిరాజుకు నివాళులర్పించారు.

సంక్షిప్తంగా..

అలరించిన సంగీత విభావరి



గీతాలు ఆలపిస్తున్న యువతులు

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. వైజాగ్ బీట్స్ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు మహిళా గాయకులు పాటలను ఆలపించారు. సినీ దర్శకులు పీసీ ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైజాగ్ బీట్స్ తరపున డిజైర్ సొసైటీ హెచ్ఐవీ బాలల సంరక్షణ సంస్థకు రూ.పది వేలు సాయాన్ని అందించారు. ముగింపు వేడుకలకు గజల్ శ్రీనివాస్ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ నగరానికి చెందిన మహిళలు ఒక బృందంగా ఏర్పడి ఇలాంటి కార్యక్రమాలు చేయడం హర్షణీయమన్నారు. కళా నైపుణ్యం ఉన్నవారికి అవకాశాలు చాలా ఉన్నాయని అన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ

వెంకోజీపాలెం, అక్టోబరు 20 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా వచ్చి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల మనుగడకు ఐసీఈయూ పోరాటం



మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

డాబాగార్డెన్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని ప్రగతి పథంలోకి నడిపించడానికి దోహదపడే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్‌పరం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్న సమయంలో ఏఐఐఈఏ అందులో భాగమైన ఐసీఈయూ అనేక పోరాటాలు చేస్తూ బీమా రంగంలోని ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయకుండా నిలువరించగలిగామని ఆలిండియా బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని ఐసీఈయూ 50వ ఆవిర్భావ సమావేశాన్ని నిర్వహించారు. ఐసీఈయూ ఆవిర్భావం నుంచి ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. జీవితబీమా, ఆరోగ్యబీమా ప్రీమియంపై జీఎస్టీని ఎత్తివేయాలని ఏఐఐఈఏ చేస్తున్న పోరాటంలో భాగంగా కేవలం 22 రోజుల వ్యవధిలో సుమారు 400 మంది ఎంపీలను కలిసి ప్రజలు నష్టపోతున్న తీరును వివరించామన్నారు. కార్యక్రమంలో బీమా సంస్థ ఉద్యోగుల సంఘం విశాఖపట్నం అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

ప్రతి రోజు ఒక సబ్జెక్టులో ఓ పాఠ్యాంశంపై పరీక్ష నిర్వహించనున్నారు. మొదటి రోజు సోమవారం తెలుగు సబ్జెక్టుపై పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను జిల్లాస్థాయిలోని రిసోర్స్ పర్సన్లతో కూడిన సబ్జెక్టు నిపుణుల కమిటీ రూపొందించింది. ప్రతిరోజు పరీక్ష అనంతరం జవాబు పత్రాలు మూల్యాంకనం చేసి విద్యార్థుల సామర్థ్యం మదింపుచేయనున్నారు. దీనివల్ల తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేందుకు అవకాశం ఉంటుందని విద్యాశాఖ భావిస్తోంది.


తాతయ్యబాబును కలిసిన హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్



రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబును బుచ్చెయ్యపేటలోని ఆయన నివాసంలో హౌసింగ్ కార్పొరేషన్ విశాఖ జిల్లా పీడీ శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురూ హౌసింగ్ కార్పొరేషన్‌కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం!



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

హక్కుల గురించి కాంట్రాక్టు కార్మికులు ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరింపులు, ఆందోళనలు భగ్నం

న్యాయం చేయకపోతే కుటుంబాలతో సహా ఆందోళనకు దిగుతామంటున్న కార్మికులు

మల్కాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మల్కాపురంలోని హెచ్‌పీసీఎల్‌లో పలువురు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. హక్కుల కోసం ఎవరైనా కార్మికులు ప్రశ్నిస్తే వారిని కాంట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారితో బెదిరించే ప్రయత్నాలు చేస్తు కార్మిక హక్కులను కాలరాస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో కార్మికులు ఏ విషయంపైనా కాంట్రాక్టర్లతో మాట్లాడేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఎక్కడైనా కార్మికులు తమ హక్కుల కోసం అడిగితే సదరు కాంట్రాక్టరుతో పాటు కంపెనీ యజమాన్యం, యూనియన్ నాయకులు కూర్చుని కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తారు. అందుకు విరుద్ధంగా హెచ్‌పీసీఎల్‌లో మాత్రం కార్మికులు తమ హక్కుల గురించి అడిగినా, స్థానికులకు ఉపాధి కల్పించాలని ఆందోళనకు దిగినా సదరు కాంట్రాక్టర్ పోలీసులకు ఫోన్ చేసి వారితో ఆందోళనను భగ్నం చేయిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా లేబర్ కమిషనర్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కాగా పలు యూనియన్ నాయకుల పరిస్థితి మరీ విడ్డూరంగా ఉంటుంది. వారు కార్మికుల పక్షాన ఉన్నట్టే నటిస్తూ.. ఆఖరికి కాంట్రాక్టర్లకే మేలు చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు గడువు ముగిసిన కార్మికునికి ఫైనల్ సెటిల్‌మెంట్ చేసేటప్పుడు.. ఉదాహరణకు పది రూపాయలు రావాల్సి ఉంటే రూ.ఐదు చేతులో పెట్టి దీంతో సరిపెట్టుకోండంటూ యూనియన్ నాయకులు చెబుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలా మిగిలిన ఐదు రూపాయలను సదరు కాంట్రాక్టర్, యూనియన్ నాయకులు పంచుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఇలా ఇటు కాంట్రాక్టర్, అటు యూనియన్ నాయకుల మధ్య తాము నలిగిపోతున్నామని పలువురు కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి కార్మిక చట్ట ప్రకారం కార్మికుడికి ఫైనల్ సెటిల్‌మెంట్ చేసేటప్పుడు ఆయన పనిచేసిన కాలానికి గాను నెలకు ఆరున్నర రోజుల చొప్పున ఎంత నగదు రావాల్సి ఉంటే అంత చెల్లించాలి. కానీ కాంట్రాక్టర్లు అలా చెల్లించకుండా నెలకు మూడు రోజులకే నగదు ఇస్తామని చెబుతున్నారు. ఇలా తీసుకుంటే కార్మికులకు రూ.వేలలో నష్టం వాటిల్లుతుంది. సదరు కాంట్రాక్టర్లకు మాత్రం రూ.లక్షల్లో మిగులుతుంది.

వారం రోజులుగా కార్మికుల నిరసన

కాగా ఎల్అండ్‌టీ వద్ద సబ్ కాంట్రాక్టరుగా హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు చేయిస్తున్న ఎంఎంఎల్ సంస్థ కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలతో పాటు కాంట్రాక్టు గడువు ముగిసిన వారికి ఫైనల్ సెటిల్‌మెంట్ చేయడంలో అన్యాయంగా వ్యవహరిస్తున్నారంటూ కార్మికులు గత వారం రోజులుగా టూల్ డౌన్ చేసి నిరసన తెలుపుతున్నారు. దీంతో ఆ కాంట్రాక్టర్ అయితే కార్మికులపై మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కార్మికులతో మాట్లాడగా వారు తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. దీంతో పోలీసులు చట్టబద్ధంగా కార్మికులకు ఇవ్వాల్సి మొత్తాన్ని చెల్లించాలని కాంట్రాక్టరుకు సూచించారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ ససేమిరా అనడంతో కార్మికులు నిరసన బాట పట్టారు. ఇప్పటికైనా హెచ్‌పీసీఎల్ యాజమాన్యంతో పాటు లేబర్ కమిషనర్ పట్టించుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కార్మికులు కోరుతున్నారు. లేకుంటే పారిశ్రామిక ప్రాంతంలో తమ కుటుంబాలతో సహా ఆందోళనకు దిగుతామని వారు స్పష్టం చేశారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

'గాజువాక'ను మోడల్‌గా తీర్చిదిద్దుతా..

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గాజువాకను అన్ని విధాల అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 67వ వార్డు పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు నియోజకవర్గం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గాజువాకలో ఉన్న సమస్యలను గుర్తించామని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారులు, డ్రైనేజీలను నిర్మించడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, నాయకులు పల్లా రంగా, కె.సింహాచలం, గొలగాని గోపి, చిత్రాడ అప్పారావు, కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాపై దృష్టి సారించరూ..



వుడా నగర్ ఫేజ్-1 కాలనీలో వృథాగా పోతున్న నీటితో జలమయమైన రహదారి

కూర్మన్నపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో తాగునీరు వృథాగా ప్రవహించడం నిత్యకృత్యంగా మారింది. వుడా నగర్ ఫేజ్-1, రాసాలమ్మ కాలనీ పరిసర ప్రాంతాల్లోని తాగునీటి పైపు లైన్లు, ఫ్లాంజ్‌లకు లీకేజీలు ఏర్పడడంతో తాగునీరు వృథాగా పారుతూ మురుగు కాలువల్లో కలిసిపోవడంతో పాటు లోతట్టు ప్రాంతాల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోతుంది. గత కొంతకాలంగా నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపు లైన్ల లీకేజీల వల్ల కొళాయిల ద్వారా తమ ఇళ్లకు సరిపడేంత తాగునీరు రావడం లేదని, దీంతో నీటి కోసం నానాపాట్లు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సాహితీ విహారి విశ్వనాథ సత్యనారాయణ

నటాలి సంస్థ కన్వీనర్, ప్రముఖ నాటక రచయిత కొత్తపల్లి బంగారురాజు



విశ్వనాథ సత్యనారాయణ, రావూరి భరద్వాజ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నటాలి సంస్థ ప్రతినిధులు

పెదగంట్యాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జ్ఞానపీఠ అవార్డు గ్రహీత దివంగత డాక్టర్ విశ్వనాథ సత్యనారాయణ తెలుగు సాహిత్య రంగంలో విజయవిహారం చేశారని నటాలి సంస్థ కన్వీనర్, ప్రముఖ నాటక రచయిత కొత్తపల్లి బంగారురాజు అన్నారు. నటాలి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వుడా కాలనీలోని సంస్థ కార్యాలయంలో ప్రముఖ రచయితలు విశ్వనాథ సత్యనారాయణ, రావూరి భరద్వాజ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ రచించిన వేయిపడగలు సాహితీప్రియులను ఎంతగానో అలరించిందన్నారు. ఆయన సాహితీవేత్తే కాకుండా ఎన్నో కథలు, నాటకాలు రాశారన్నారు. కార్యక్రమంలో నటాలి సంస్థ సభ్యులు తమిరే శివప్రసాదరావు, పోతిన వెంకటేశ్వరరావు, బి.లక్ష్మణ స్వామి, ఎ.సత్యనారాయణ, భీమా సాహు, ఎ.కొండలరావు, పి.లోకేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు. ముందుగా విశ్వనాథ సత్యనారాయణ, రావూరి భరద్వాజ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్యాన్సర్ బాధితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న భెల్ హెచ్‌పీవీపీ యోగా శిక్షకులు రమణమూర్తి మనవడు చిరంజీవి వైద్య ఖర్చుల నిమిత్తం యోగా అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం భెల్ హెచ్‌పీవీపీ యోగా మందిరంలో జరిగిన కార్యక్రమంలో రమణమూర్తి కుటుంబ సభ్యులకు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గోపిశెట్టి ఆదినారాయణ రూ.లక్షా 35 వేలను చెక్కు రూపంలో అందచేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

మల్కాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 59వ వార్డులో గల హనుమాన్ నగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనను 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్, వైసీపీ వార్డు అధ్యక్షుడు రేవల సత్యనారాయణలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు కేఆర్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

కూర్మన్నపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మనిషి జీవనానికి మొక్కలే ప్రాణాధారమని శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు అన్నారు. 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో ఆదివారం కాలుష్య నివారణకు వివిధ రకాల పండ్ల, పుష్ప, ఔషధ మొక్కలను వారు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రజలందరూ కాలుష్య నివారణ కోసం విధిగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పట్టాలు పరిశీలన

సింధియా, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి చింతలలోవలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పట్టాల వెరిఫికేషన్ కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గల్లా చిన్నా మాట్లాడుతూ ఎమ్మెల్యే పి.గణబాబు ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. అప్పట్లో టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ఇప్పటికీ వాటిని కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎంతోమంది లబ్ధిదారులు డీడీలు కట్టినా వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో సమస్యను త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుడేల కృష్ణ, జెర్రిపోతుల నర్సింగ్, పుక్కల రాజారావు, బొండా కృష్ణ, అమెరికా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ప్రారంభం

అగనంపూడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని సీడబ్ల్యూసీ వద్ద ఆదివారం ప్రేరణ అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ (స్వచ్ఛంద సంస్థ)ను ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ జీఎం దువ్వాడ రాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రజాసేవ కోసం స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి బొమ్మల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ,గుదే సుశీల గజేంద్రరావు, కేజే నాయుడు, జయలక్ష్మి, ఆశాలత, వి.వరహాలు, తదితరులు పాల్గొన్నారు.



గోతులమయమైన కొత్తపాలెం-నరవ ప్రధాన రహదారి

రోడ్డు దాటాలంటే ఫీట్లు చేయాల్సిందే..

గోతులతో నిండిన కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారి

నానాపాట్లు పడుతున్న వాహనదారులు

గోపాలపట్నం, అక్టోబరు 20 (ఆంధ్యజ్యోతి): నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఆ రోడ్డంతా గోతులు పడడంతో దానిని దాటేందుకు తాము ఫీట్లు చేయాల్సి వస్తోందని పలువురు ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులమయమైన ఈ మార్గంలో రాకపోకలు సాగించడం వల్ల తమ వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. అంత దుర్భరంగా మారింది 89వ వార్డు పరిధి కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారి. ఎంతో కాలంగా ఈ ప్రాంతం ముంపునకు గురై రహదారి కోతకు గురయ్యేది. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇక్కడ పెద్దఎత్తున నీరు నిల్వ ఉండడంతో అంతంతమాత్రంగా ఉన్న ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు పాదచారులు నానాపాట్లు పడుతున్నారు. రాత్రివేళల్లో గోతుల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ద్విచక్ర వాహన చోదకులు చెబుతున్నారు. అందువల్ల ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కొత్తగా రోడ్డు నిర్మాణానిని తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన దసరా వేడుకలు

వేపగుంట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సింహాచలం ఆర్టీసీ డిపోలోని దుర్గమ్మ గుడిలో నిర్వహించిన దసరా వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.రమణారెడ్డి మాట్లాడుతూ డిపోలోని కార్మికులంతా ఏటా కుటుంబ సభ్యులతో కలిసి దసరా సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సాయంత్రం దుర్గాదేవి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.శ్రీనివాసరాజు, పీవీవీ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)

● **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53,టమాటా 47,వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 30, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 28,కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 30, క్యారెట్ 50 దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయ 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250

షాపుల కోసం మద్యం వ్యాపారుల వెతుకులాట

గాజువాక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని అమలులోకి తీసుకురావడంతో కొత్తగా మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. అన్ని రకాల బ్రాండ్‌లు ఆయా మద్యం దుకాణాల్లో లభ్యం అవుతుండడం పట్ల మందుబాబులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు సుమారు ఇరవై కొత్త మద్యం షాపులు ప్రారంభమైనట్టు సమాచారం. ఇంకా గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడెక్కడ మద్యం అమ్మకాలు బాగా సాగుతాయోనని మద్యం వ్యాపారులు ఆరా తీసి ఆయా ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేసేందుకు వెతుకులాటలో నిమగ్నమయ్యారు. గాజువాకలో ఎన్ని షాపులు వస్తాయన్న దానిపై ఇప్పటివరకు అధికారులకు కూడా స్పష్టత లేదు.

గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సుమారు 50 షాపులు ఏర్పాటయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రొవిజనల్ అనుమతులతోనే మద్యం దుకాణాలను నడుపుతున్నారు. ఆయా దుకాణాలు పూర్తి స్థాయిలో ఏర్పాటైన తర్వాత వ్యాపారులకు పూర్తి స్థాయిలో అనుమతులు ఇస్తామని ఎక్సైజ్ సీఐ నాగ శ్రీనివాస్ తెలిపారు.

కార్మిక హక్కులకు భంగం కలిగితే ఊరుకోం

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులకు భంగం కలిగితే సహించేది లేదని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులకు భంగం కలిగించేలా ఉక్కు యాజమాన్యం వ్యవహరిస్తుందని, దీంతో కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తున్న కార్మికులకు మాత్రం న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికైనా కార్మిక సంక్షేమంపై యాజమాన్యం దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో నాయకులు బీఎస్ రాజు, కొవిరి అవతారం, మంత్రి గోపీనారాయణ, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు మిగుల భూములను కేటాయించాలి

స్టీల్‌ప్లాంట్ మిగుల భూములను నిర్వాసిత నిరుద్యోగులకు కేటాయించాలని టీఎస్‌టీయూసీ ప్లాంట్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి అన్నారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి లభిస్తుందన్న ఆశతో నాడు నిర్వాసితులందరూ ఉక్కు కర్మాగారం కోసం భూములు ఇచ్చారని, కానీ ఇప్పటికీ చాలామందికి ఉపాధి లభించలేదన్నారు. ప్లాంట్ మిగుల భూములను ప్లాంట్ అభివృద్ధికే వాడాలని, కానీ కేంద్ర ప్రభుత్వం వాటిని విక్రయించేందుకు కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.శ్రీనివాస్, నరేంద్ర, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు గండికొడుతున్న యాజమాన్యం

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై ఉక్కు యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం మండిపడ్డారు. ప్రతినెలా జీతాలు చెల్లించడంతో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. కొన్ని నెలలుగా వాయిదాల పద్ధతిలో జీతాలస్తుండడం దారుణమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లాంట్‌లో ఇంత జరుగుతున్నా గుర్తింపు యూనియన్ మాత్రం ఉక్కు యాజమాన్యంపై ఎలాంటి ఒత్తిడి తేవడం లేదని, ఇది ఉద్యోగుల భవిష్యత్తుకు ప్రమాదమన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల యాజమాన్యం స్పందించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో వసతుల కల్పనకు కృషి: ఎమ్మెల్యే గణబాబు



లక్ష్మీనగర్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి పార్కును ప్రారంభిస్తున్న గణబాబు

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొండవాలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్టు పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. 90వ వార్డు పరిధి బాజీ జంక్షన్ సంత వెనక లక్ష్మీనగర్ ఎఫ్-బ్లాక్‌లో రూ.46 లక్షలతో నిర్మించిన పంచతత్వ పార్కును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రేటర్ నిధులతో కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాన్ని ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పార్కులో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టు, వాకింగ్ ట్రాక్, చిన్నారుల క్రీడా సామగ్రి స్థానికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. తొలుత శ్రీనివాసనగర్ కాలనీ, లక్ష్మీనగర్ అసోసియేషన్ సభ్యులు గణబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జెడ్సీ కె.హైమావతి, ఈఈ రత్నాకరరెడ్డి, టీడీపీ నాయకులు పైడిరాజు, ప్రసాద్, పట్నాయిక్, శివ, రమణ, వెంకటరావు, నరవ అనూష, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా మహిళా ప్రగతి కేంద్రం చిన్న మిల్లు ఏరియా, వెలంపేట, ప్రగతి నగర్, జ్యోతి కాటా, నటరాజ్ థియేటర్ ప్రాంతం, ఓల్డ్ సాయి ఐటీఐ, ఎల్ఐసీ కాలనీ, వెటర్నరీ ఆస్పత్రి, పెందుర్తి జంక్షన్, రాతి చెరువు, తమిళనాడు మార్కెట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

31 వరకు బీజేపీ సభ్యత్వ నమోదు

గాజువాక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఇప్పటివరకు 23 వేల మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. 'గాజువాక'లో 30 వేల సభ్యత్వమే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామన్నారు. నాయకులు రంజిత్, అనురాగ్‌సింగ్, రాహుల్‌షా, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్ సమస్యలపై కార్పొరేటర్‌కు వినతి

అగనంపూడి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శ్రీనివాస్‌నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లను ఏర్పాటు చేయాలని కోరుతూ కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌కు అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో ప్రతినిధులు శ్రీనివాసరావు,రామునాయుడు,వెంకటరావు,సతీశ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా సంగీత మాధురి వార్షికోత్సవం

పెదగంట్యాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి హెచ్‌బీ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సంగీత మాధురి సంస్థ 40వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు అద్దంకి రామాచార్యులు సంగీత మాధురి 40 ఏళ్ల ప్రస్థానాన్ని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గంగవరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పైడి హేమలత మాట్లాడుతూ సంగీత మాధురి సంస్థ సాహిత్యానికి, సంగీతానికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుజాత హాస్పిటల్ ఎండీ డాక్టర్ సుజాత, సంస్థ కార్యదర్శి వీఎస్ఎం అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 300 మందికి సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ అక్కిరెడ్డిపాలెం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామాలయం వద్ద నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన వచ్చింది. మెడికవర్, పుష్పగిరి కంటి ఆస్పత్రులు సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులతో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'పవన్ స్ఫూర్తితోనే పోరాటం'



సమావేశంలో మాట్లాడుతున్న బి.వి.రామ్ తదితరులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్.ఎన్.పాల్ స్వరూపానందేంద్ర సరస్వతి అక్రమాలపై తన రాజీలేని పోరాటానికి స్ఫూర్తి పవన్‌కల్యాణ్ అని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితోనే ఎస్.ఎన్.పాల్ అక్రమాలపై కలెక్టర్ నుంచి రాష్ట్రపతి వరకు ఫిర్యాదు చేశానన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి పీఠానికి కేటాయించిన 15 ఎకరాల భూమిని తిరిగి తీసుకోవడం చారిత్రక ఘట్టమన్నారు. హిందూమతం ముసుగులో హడావుడి చేసిన స్వరూపానందేంద్రకు కూటమి ప్రభుత్వం తగిన బుద్ధి చెప్పిందన్నారు. హిందూమతం పరిరక్షణకు ప్రాణాలైనా అర్పిస్తానన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి బి.దొరబాబు, బీసీ నాయకులు డి.పరమేశ్వరరావు, కె.నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో 11 కేవీ కైలాసపురం, శాంతిపురం, గణేష్ నగర్ ఫీడర్స్ విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరుకుతున్న కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. కస్తూరినగర్-1, 2, మధుసూదన్‌నగర్, దుర్గా కైలాస్‌నగర్, సత్యసాయి నగర్, కైలాసపురం, వాసుదేవనగర్, సంజీవయ్యకాలనీ, గణేష్‌నగర్, గణేష్ సేవా సంఘం ఏరియా, నరసింహనగర్ ప్రధాన రహదారి, విశాఖ సదన్ ఏరియాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా వాయిదా పడిన వివిధ క్రీడాంశాల ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలను మంగళవారం నుంచి నిర్వహించే విధంగా షెడ్యూల్ పునరుద్ధరించామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవుడు తెలిపారు. ఈ నెల 22న లంకెలపాలెంలో అండర్-14 బాలుర, బాలికల ఖోఖో పోటీలు జరుగుతాయన్నారు. 23న నక్కపల్లిలో అండర్-14 బాలుర, బాలికల హాకీ పోటీలు, సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో అండర్-14, 17 బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

తాతయ్యబాబును కలిసిన హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్




రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబును బుచ్చెయ్యపేటలోని ఆయన నివాసంలో హౌసింగ్ కార్పొరేషన్ విశాఖ జిల్లా పీడీ శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఇరువురూ హౌసింగ్ కార్పొరేషన్‌కు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

'విజయసాయిరెడ్డి నియామకంపై నేతల హర్షం'

డాబాగార్డెన్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్ర జిల్లాలకు సమన్వయకర్తగా వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి నియామకం అభినందనీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమం, జీవీఎంసీ ఎన్నికల్లో విజయం వెనుక విజయసాయిరెడ్డి కృషి ఎంతో ఉందన్నారు .వైసీపీ జిల్లా అధ్యక్షునిగా అమర్‌నాథ్, ఉభయ గోదావరి జిల్లాల సమన్వయకర్తగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ నియామకం హర్షణీయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. వైసీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో తామంతా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. వైసీపీ నాయకుడు అల్లా కృష్ణ మాట్లాడుతూ విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్‌గా ఉన్న తరుణంలోని నాయకత్వం బలోపేతమైందన్నారు. వైసీపీ హయాంలో బడుగు, బలహీనవర్గాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలియజేశారు.

వీధుల్లో అంధకారం



నక్కవానిపాలెంలో ఎంఆర్ఓ కార్యాలయం ఎదురు రోడ్డులో వెలగని విద్యుత్ హైమాస్ట్ దీపం

సీతమ్మధార, అక్టోబరు 20: (ఆంధ్రజ్యోతి): నగరంలోని 24వ వార్డులో పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం, అరాచకాలు రాజ్యమేలుతున్నాయి. చీకటిలో మద్యం ప్రియులు చిందులు వేస్తున్నారు. పలువురు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. సీతమ్మధార నక్కవానిపాలెంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డులో వేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలు చాలా రోజులుగా వెలగటం లేదు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ హైమాస్ట్ ల్యాంప్ చెట్ల కొమ్మల మధ్యలో ఉండటంతో ఆ శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కవానిపాలెం రామాలయం వీధుల్లో కూడా కొన్ని విద్యుత్ స్తంభాలపై దీపాలు వెలగటం లేదు. రాత్రివేళ పాదచారులు నడిచి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుక్కలు వెంటపడుతుండటంతో పిల్లలు, మహిళలు భయపడుతున్నారు. చైతన్యనగర్, క్రాంతినగర్, వివేకానంద కళ్యాణ మండపం రోడ్డులోనూ అంధకారం నెలకొంది. ఇటీవల ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ తదితరులు పాల్గొన్న ఉన్నతాధికార సమావేశంలో నగరంలో అంధకారం నెలకొన్న పరిస్థితిని చర్చించి తక్షణ పరిష్కారానికి సూచనలు ఇచ్చినా ఆ దిశగా చర్యలు వేగవంతం కాలేదు. తక్షణమే వీధుల్లో అంధకారం తొలగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నత్తనడకన జోనల్ కార్యాలయ నిర్మాణం



ఇంకా పునాదుల్లోనే ఉన్న పనులు

మురళీనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కార్యాలయ శాశ్వత భవన నిర్మాణంలో కదలిక వచ్చినా పనులు ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది జనవరిలో జోన్-5 కొత్త కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మాణాలు ఆరంభించారు. వైసీపీ పాలనలో రూ.2 కోట్లతో కొత్త కార్యాలయం రూపొందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ముగ్గురు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలో జీఎస్‌ఐ కార్యాలయాన్ని ఆనుకుని ఈ కొత్త కార్యాలయం నిర్మిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశం, సువిశాల బ్లాకులు, అందమైన ఎలివేషన్‌తో ఆకృతి ఖరారు చేసినా పనులు పునాదుల దశలోనే ఉన్నాయి. దాదాపు 15 ఏళ్లకిందట ప్రతిపాదించిన ఈ కార్యాలయం నేటికీ రూపుదాల్చలేదు. నిర్మాణ సామగ్రి పంప్ హౌస్ ఆవరణలో రాకపోకలకు అడ్డంగా ఉంది. యంత్ర సామగ్రి కూడా చెల్లాచెదురుగా పడి ఉంది. ఈ నిర్మాణం పూర్తయితే జ్ఞానాపురం వద్ద ఉన్న కార్యాలయాన్ని ఇక్కడికి తరలిస్తారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘంలో మహిళలకు ప్రాధాన్యం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా కె.లక్ష్మీపతిరాజు, ప్రధాన కార్యదర్శిగా సైకం రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో జరిగిన సంఘం నూతన కార్యవర్గంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ పి.వి.కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా బి.కృష్ణమూర్తి, బి.పాండురంగారెడ్డి, వై.కోటేశ్వరమ్మ, పి.అప్పారావు, కె.లతాదాస్, రామ్‌కుమార్; సంయుక్త కార్యదర్శులుగా ఎం.బాపిరాజు, సీహెచ్.జగదీష్, బి.వి.నాగేశ్వరరావు, వై.వెంకటరెడ్డి, ఎం.హరిగోపాల్, వి.నాగ సుందరం, రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎల్.సుశీల, ఎ.వి.భాస్కరరావు, ఎ.వి.వి.వి.ప్రసాద్‌రాజు, భాగ్యలక్ష్మి, మోహన లక్ష్మి నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్, పర్యవేక్షకునిగా జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ సమాఖ్య ప్రతినిధి వికాస్ కరార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం కొనసాగే ఐదేళ్ల పదవీ కాలంలో ప్రణాళికబద్ధంగా జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నీలతోపాటు జాతీయ, అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్ నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గంలో మహిళలకు ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. 30 నుంచి 100 మంది వరకు పురుషులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్న మాస్టర్ అథ్లెటిక్స్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం అందే విధంగా నూతన కార్యవర్గ సభ్యులంతా ప్రయత్నిస్తామన్నారు.

టమాటా కొనుగోలుకు వినియోగదారులు బారులు



నరసింహనగర్ రైతు బజారుకు టమాటా కోసం వచ్చిన కొనుగోలుదారులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నరసింహనగర్ రైతుబజారులో కిలో టమాటా రూ.47లకు విక్రయించడంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు తీరారు. బహిరంగ మార్కెట్లలో కిలో టమాటా రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తుండడంతో వినియోగదారులు రైతుబజారుకు వస్తున్నారు. దీంతో రైతుబజారు కిటకిటలాడింది. ఎస్టేట్ అధికారి పి.చిన్నబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ దుకాణాలను పరిశీలించారు.

'మద్యం దుకాణం ఎత్తివేయండి'



దుకాణం వద్ద బైఠాయించిన స్థానికులు

జ్ఞానాపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 34వ వార్డు చావుల మదుం భూపేష్ నగర్ ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న వైన్‌షాపును మార్చాలని మహిళలు, చిన్నారులు, స్థానికులు రెండోరోజు ఆదివారం ఆందోళన కొనసాగించారు. యజమానులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ ప్రాంతం నుంచి తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని వారు తేల్చి చెప్పారు.

పూర్ణామార్కెట్‌లో బ్లేడుబ్యాచ్ ఆగడాలు



పూర్ణామార్కెట్‌లో ఆకతాయిల అడ్డాగా మారిన ప్రాంతం

జగదాంబ కూడలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్ లోపల ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. తెల్లారిందే మొదలు అర్ధరాత్రి వరకు మద్యం, గంజాయి, డ్రగ్స్ సేవించేందుకు యువకులు లోపల పర్మినెంట్ దుకాణాల మధ్య ఖాళీ స్థలాన్ని అడ్డాగా మార్చుకుంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపార కూడళ్ళ మధ్య వీరి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. ఒక వేళ ప్రశ్నిస్తే దాడులకు పాల్పడతారేమోనని భయాందోళన చెందుతున్నారు. ఇటీవల పూర్ణామార్కెట్‌లో బ్లేడు బ్యాచ్‌లు రెచ్చిపోతున్నట్లు వ్యాపారవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా తుని నుంచి వచ్చి పూర్ణామార్కెట్‌లో తమలపాకుల వ్యాపారం నిర్వహించే వ్యాపారిని బ్లేడుతో దాడి చేసి జేబు నుంచి డబ్బు లాక్కెళ్ళిన సంఘటన వ్యాపారుల్లో భయాందోళనకు గురిచేస్తుంది. అనేక ప్రాంతాల నుంచి వలస వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. పండుగల సమయంలో మరింత ఎక్కువ మంది వచ్చి వ్యాపారాలు సాగిస్తారు. ఇటీవల దసరా పండుగ నేపథ్యంలో తమలపాకుల వ్యాపారిపై దాడి జరిగినట్లు చెప్పుకొంటున్నారు. దీనిపై వలస వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకడుగు వేశారని అంటున్నారు. మెయిన్ రోడ్డు నుంచి వెళ్లే మార్గం వద్ద పూల వ్యాపారాలు నిర్వహించే చోట అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వన్‌టౌన్ పోలీసులు రాత్రి గస్తీలు తూతూమంత్రంగా చేపట్టడంతో వీరి ఆగడాలు మితిమీరుతున్నాయి. పాతనగరంలో బ్లేడు బ్యాచ్ సంస్కృతి నడుస్తోందన్నది పోలీసులకు తెల్సిందే. అసాంఘిక పనులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

తెల్లారకముందే మత్తు పదార్థాల సేవనం

పూర్ణామార్కెట్ లోపల వ్యాపారం చేసుకుంటున్న ఓ మహిళ (70) మాట్లాడుతూ.. దుకాణం వెనుక ఖాళీ స్థలంలో 15 ఏళ్ళ వయసు బాలురు షాపుతెరవకముందు నుంచి కూర్చుని మత్తు పదార్థాలు, గంజాయి బహిరంగంగా పీలుస్తున్నారని చెప్పారు. మద్యం తీసుకుని ఎపుడుపడితే అప్పుడే ఇక్కడకు వచ్చి తాగుతారన్నారు అక్కడే మూత్ర విసర్జన చేస్తారని, దాడి భయంతో వెనక్కు తగ్గుతున్నామని అన్నారు.

'నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలి'



ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

కంచరపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఐద్వా కంచరపాలెం జోన్ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. పెరిగిన ధరలను నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఐద్వా జోన్ నాయకురాలు బి.పద్మ మాట్లాడుతూ నిత్యాసర ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి వస్తువుపై జీఎస్టీ పేరుతో పన్నుల భారం వేస్తున్న ప్రభుత్వాలు పేదలు తినే ఆహార పదార్థాలపై సబ్సిడీ ప్రకటించలేరా? అని ప్రశ్నించారు. పెరిగిన ధరలతో ప్రజలు కూరగాయలు, నిత్యావసర సరుకులను కొనలేని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వ అధినేతలు దృష్టి సారించి ధరలు తగ్గించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, ఇతర నాయకులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దుచేయాలి: సీపీఐ



సీతమ్మధారలో రైతు బజార్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార, అక్టోబరు 29: (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఆర్థిక భారాలు, విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఐ నాయకులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సీతమ్మధార రైతుబజార్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన విద్యుత్, వంటనూనె, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వామనమూర్తి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ప్రజలు వాడే నిత్యవసర వస్తువులు, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి ఆర్థిక భారం మోపారని మండిపడ్డారు. పెంచిన ధరలు తగ్గించి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో పడాలి గోవింద్, రావికృష్ణ, ఎస్.మధురెడ్డి, కె.శివ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రొఫెనల్స్ కోసం డిప్లొమా కోర్సులు



ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ

కంచరపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న వర్కింగ్ ప్రొఫెనల్స్ కోసం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల్లో సాయంత్రం పూట డిప్లొమా కోర్సులు ప్రారంభించడానికి సాంకేతిక శాఖ అనుమతి మంజూరు చేసింది. కోర్సులకు సంబంధించిన వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ వెల్లడించారు. వివిధ ప్రభుత్వ/ప్రయివేటు కంపెనీలు, సంస్థలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ / బైపీసీ/ఐవీసీ లేదా ఐటీఐ కోర్సులు పూర్తిచేసి విధులు చేపడుతున్న వారు ఈ కోర్సుల్లో చేరి వారి అర్హతలను పెంచుకోవచ్చునన్నారు. కెమికల్ ప్లాంట్లో మెయింటెనెన్స్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్, లేబొరేటరీ అసిస్టెంట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ తదితర ఉద్యోగాలు చేస్తున్న వారు కనీసం ఏడాది పాటు రెగ్యులర్‌గా, కళాశాల నుంచి 50 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తు ఉండాలి. ఈ డిప్లొమా సర్టిఫికెట్‌తో వారి అర్హతలను పెంచుకోవడంతో పాటు పదోన్నతి కూడా పొందడానికి అర్హులు అవుతారన్నారు. అభ్యర్థులు ఈ నెల 26లోగా తమ దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఈనెల 28న కౌన్సెలింగ్ నిర్వహించి 30న అర్హుల జాబితాను ప్రకటించనున్నారు. నవంబరు 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన రూ.18 వేలు సెమిస్టర్ ఫీజుగా తెలిపారు. వివరాలకు సంప్రదించాలని రమణ కోరారు.

భవనాల అన్వేషణలో టీసీఎస్!

... 5వ పేజీ తరువాయి

క్యాంపస్‌లో 15వేల మంది పనిచేసేలా ప్రతిపాదిస్తున్నారు. అందరినీ ఒకేసారి కాకుండా, దశలవారీగా నియమించుకుని కార్యకలాపాలు చేపట్టనున్నారు. మిలీనియం టవర్‌లో ఒక భవనం, నగరంలో మూడు ప్రైవేటు భవనాల పరిశీలనకు కంపెనీ నుంచి ఉన్నత స్థాయి బృందం వచ్చే అవకాశం ఉందని తెలిసింది. అటు తరువాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకోవడం, సొంత క్యాంపస్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని సమాచారం.

100 రోజుల ప్రణాళిక...

5వ పేజీ తరువాయి

ప్రతి రోజు ఒక సబ్జెక్టులో ఓ పాఠ్యాంశంపై పరీక్ష నిర్వహించనున్నారు. మొదటి రోజు సోమవారం తెలుగు సబ్జెక్టుపై పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను జిల్లాస్థాయిలోని రిసోర్స్ పర్సన్లతో కూడిన సబ్జెక్టు నిపుణుల కమిటీ రూపొందించింది. ప్రతిరోజు పరీక్ష అనంతరం జవాబుపత్రాలు మూల్యాంకనం చేసి విద్యార్థుల సామర్థ్యం మదింపుచేయనున్నారు. దీనివల్ల తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేందుకు అవకాశం ఉంటుందని విద్యాశాఖ భావిస్తోంది.

ఎన్టీఆర్ జిల్లాలో ఘోరం

... 5వ పేజీ తరువాయి

చేరుకోగా, అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న శ్రీకాంత్‌తో పాటు నాగలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. మల్లికార్జునరావు కుడి కాలు విరిగి పోగా, చైతన్యకు స్వల్పగాయాలయ్యాయి. సీఐ జానకీరాం, చిల్లకల్లు ఎస్ఐ శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బాస్కెట్‌బాల్ చాంప్ ఏవీఎన్ కాలేజి

విశాఖపట్నం స్పోర్ట్సు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏయూ స్పోర్ట్సు బోర్డు నిర్వహించిన అంతర్ కళాశాల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నీలో మిసెస్ ఏవీఎన్ కాలేజి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ద్వితీయ, తృతీయ స్థానాలలో ఏయూ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్, ఏయూ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ జట్లు నిలిచాయి. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజి నాల్గో స్థానంతో సరిపెట్టుకుంది. ఆదివారం ఏయూ బాస్కెట్‌బాల్ కోర్టులో జరిగిన ఫైనల్స్‌లో మిసెస్ ఏవీఎన్ కాలేజి 43-28 పాయింట్లతో ఏయూ కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్‌పై విజయం సాధించింది. లూజింగ్ సెమీస్‌లో ఏయూ కాలేజి ఆర్ట్స్ అండ్ కామర్స్ 44-34 పాయింట్లతో బుల్లయ్య కాలేజీపై గెలుపొందింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ సీనియర్ కోచ్ బొజ్జా రామయ్య, కోచ్ రామచందర్, ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, ఎస్.గోపీకృషణ, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఫలితమిచ్చిన ఐసీఈయూ పోరాటాలు'



మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా..

డాబాగార్డెన్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని ప్రగతి పథంలోకి నడిపించడానికి దోహదపడే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్‌పరం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్న సమయంలో ఏఐఐఈఏ అందులో భాగమైన ఐసీఈయూ అనేక పోరాటాలు చేస్తూ బీమా రంగంలోని ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయకుండా నిలువరించగలిగామని ఆలిండియా బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా పేర్కొన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని ఐసీఈయూ 50వ ఆవిర్భావ సమావేశాన్ని నిర్వహించారు. ఐసీఈయూ ఆవిర్భావం నుంచి ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. జీవితబీమా, ఆరోగ్యబీమా ప్రీమియంపై జీఎస్టీని ఎత్తివేయాలని ఏఐఐఈఏ చేస్తున్న పోరాటంలో భాగంగా కేవలం 22 రోజుల వ్యవధిలో సుమారు 400 మంది ఎంపీలను కలిసి ప్రజలు నష్టపోతున్న తీరును వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో బీమా సంస్థ ఉద్యోగుల సంఘం విశాఖపట్నం అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ పాల్గొన్నారు.

నగరంలో పోలీసుల కార్డన్ సెర్చ్

అక్కయ్యపాలెం/సీతమ్మధార, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి ఆదేశాల మేరకు పోలీసులు ఆదివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రేటర్ 45వ వార్డు సత్యసాయినగర్, పరిసర ప్రాంతాల్లో వాహనాలను, ఇళ్లను తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్డన్ సెర్చ్‌లో నగరం నిరంతరం ప్రశాంతంగా ఉండేలా దోహదపడుతుందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉంచేలా, అనుమానాస్పద ప్రాంతాలను, అనుమానిత వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కోసం అన్వేషణ సాగుతుందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు నిర్వీర్యం చేయడం, సరైన పత్రాలు లేని వాహనాలు, చట్ట వ్యతిరేక చర్యలను గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. జోన్-1 నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 110 మంది సిబ్బందితో 62 బృందాలుగా, జోన్-2 గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో 50 మంది సిబ్బందితో 25 బృందాలుగా ఏర్పడి ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. కమిషనరేట్ పరిధిలో 160 మంది సిబ్బందితో తనిఖీ చేసి 43 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామని వివరించారు.

జేఏసీ అమరావతి విశాఖ జిల్లా మహిళా కమిటీ

మహారాణిపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం విశాఖ డివిజన్ కమిటీ ఎంపికైంది. ఆదివారం రెవెన్యూ భవనంలో నిర్వహించిన సమావేశంలో మహిళా విభాగం చైర్ పర్సన్ పి లక్ష్మి, కో చైర్‌పర్సన్ విద్య ఆధ్వర్యంలో ఎనిమిది మంది సభ్యులతో కొత్త కమిటీని ఎంపిక చేశారు. విశాఖ డివిజన్ చైర్ పర్సన్‌గా బీ శ్రీలత, జి. కుమారి, వి.రమ్య అనూష, కుమారి, ప్రసన్న, ఇద్దరు చొప్పున కో చైర్ పర్సన్లు, సెక్రటరీలను ఎన్నుకున్నారు.

సాగర తీరంలో ఏఎంఐఎఫ్ నివేష్ రన్



బీచ్‌రోడ్డులో 5కే రన్ నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏఎంఐఎఫ్ ఆధ్వర్యంలో సాగర తీరంలో నివేశ్ రన్ నిర్వహించారు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఆదివారం ఐదు కిలోమీటర్ల రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఐఎఫ్ ప్రతినిధి చలసాని వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రపంచ పెట్టుబడుల వారోత్సవాలను ఏటా అక్టోబరు 14 నుంచి 20 వరకు నిర్వహిస్తామన్నారు. దేశం లోని ఈ పరుగును చండీఘడ్, జోధ్‌పూర్ జంషెడ్‌పూర్, విశాఖలో నిర్వహించినట్టు వివరించారు. నగరంలో సాగిన ఈరన్‌లో సుమారు మూడు వేల మంది పాల్గొన్నారని వివరించారు.



అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి అర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి (108) పఠిస్తూ అన్ని నామాలకు పసిడి కుసుమాలతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

భీమునిపట్నం,అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డు మంగమారిపేటలో శనివారం రాత్రి నలుగురు యువకులు గంజాయి మత్తులో హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. తొలుత నలుగురూ గంజాయి మత్తులో స్థానికులతో గొడవకు దిగారు. కొందరు వారించగా దాడికి ప్రయత్నించారు. ఈవిషయం పోలీసులకు తెలియడంతో అక్కడికి చేరుకోగా యువకులు పారిపోయారు. ఇటీవల ఈ ప్రాంతంలో గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు చెబుతున్నారు.

80 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

విశాలాక్షినగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి చినజీయర్‌స్వామి ట్రస్టు, మహిళా ఆరోగ్య వికాస్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బీవీకే ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల సిబ్బందితో పాటు స్థానిక మహిళలు 80 మందికి పరీక్షలు చేశారు. అనంతరం ఆంకాలజిస్ట్ డాక్టర్ వసంత మహిళలకు వచ్చే కేన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

'కార్మిక హక్కులకు భంగం కలిగితే ఊరుకోం'

ఉక్కుటౌన్‌షిప్,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులకు భంగం కలిగితే సహించేది లేదని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ఆదివారం ఆయన యూనియన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యాజమాన్యం తీరు వల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందన్నారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం :** మెలోడి, శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాల పట్నం),మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర :** జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** శ్రీరామ

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 53, టమాటా 47, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 30, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 50 దొండకాయలు 28, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయ 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 150, పొటల్స్ 66, కీరదోస 30, కాప్సికమ్ 84, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
ఫారం ధర	135
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	250

అన్నవరంలో అటకెక్కిన సోలార్ పథకం

- ఏడేళ్ల కిందట 'సోలార్ ఎనర్జీ' అమలుకు నిర్ణయం
- జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక
- సగం పూర్తయిన పనులు
- వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ ఆశలు

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం గ్రామాన్ని సంపూర్ణ సోలార్‌గా తీర్చిదిద్దుతామన్న పాలకుల మాటలు నీటి మీద రాతలుగానే మిగిలాయి. ఏళ్లు గడుస్తున్నా... పథకం ముందుకు సాగలేదు. దీంతో కొన్ని వ్యవసాయ భూములకు మాత్రమే సోలార్ ప్యానెళ్లు పరిమితమయ్యాయి. ఇతర భూములకు ప్రతిపాదనల స్థాయిలోనే నిలిచిపోయాయి. సోలార్ విద్యుత్ బదులు సోలార్ ఎనర్జీని వినియోగించుకునేలా పథకాన్ని అమలు చేస్తున్నట్టు 2017లో అప్పటి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. ఈమేరకు కొందరు ఎన్ఆర్ఐల సహాయాన్ని తీసుకున్నారు. గ్రామంలో చాలా మంది రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రాయితీపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. దీనికి తోడ్పాటుగా ఎన్ఆర్ఐలు అందించిన రూ.95 లక్షలు కూడా వినియోగించారు. కొంత మంది రైతులు పొలాల్లో వీటిని ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమయ్యారు. కానీ చాలామందికి ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. అధికారులు గ్రామంలో ఎన్ని వీధి లైట్లు వేయాలి, వ్యవసాయానికి సౌర శక్తి యూనిట్లు ఎన్ని ఏర్పాటు చేయాలన్న దానిపై సర్వే కూడా చేశారు. గ్రామంలోని గృహాలన్నింటికీ అవసరమైన సౌర విద్యుత్ కల్పనకు ప్రణాళిక రూపొందించారు. 560 ఇళ్లకు, 200 ఎకరాల్లో సాగునీరు అందించడంతో పాటు 29 వీధిలైట్లకు సోలార్ ఎనర్జీ వినియోగానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

మండలంలోనే గ్రామాన్ని ఆదర్శంగా రూపొందించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ ఈ పథకం పనులు ముందుకు సాగలేదు. కొంతమంది రైతులు ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జీ యూనిట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలినవి ప్రతిపాదనల స్థాయిలో నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ప్రతిపాదనలు పూర్తిగా అటకెక్కాయి.దీంతో అప్పటివరకు చేసిన వ్యయం కూడా నిరుపయోగమైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉండడంతో స్థానికుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి అన్నవరాన్ని సోలార్ గ్రామంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.



గ్రామంలో ఒకచోట ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్





భీమిలి, తూర్పు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబుకి వినతిపత్రాలు ఇచ్చిన సమైక్య ప్రజా రైతు సంఘం నాయకులు

పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని వినతి

సింహాచలం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా రైతు సంఘం నాయకులు భీమిలి, తూర్పు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఈమేరకు ఆదివారం వారు నగరంలో ఆయా ఎమ్మెల్యేలను వారి నివాసాల్లో కలిశారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ వచ్చే నెల 6న హైకోర్టులో భూవివాదంపై ఉన్న కేసు విచారణకు వస్తోందని, ఆలోగా అడ్వకేట్ జనరల్‌తో చర్చిస్తానని, సత్వరమే పరిష్కారం లభించవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 25న కలెక్టర్ సమక్షంలో భూవివాదం పరిష్కారానికి ప్రత్యేక సమావేశం జరగనుందని, అందులో అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి కృష్ణంరాజు, కోశాధికారి సత్యనారాయణ, కాలనీల ప్రతినిధులు హనుమంతరావు, కృష్ణారావు, నరసింగరావు, సూర్యనారాయణ, రాంబాబు, లక్ష్మీ, రాము పాల్గొన్నారు.



సందర్శకులతో సందడిగా ఉన్న బీచ్

రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

సాగర్‌నగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం సందడిగా మారింది. వీకెండ్‌లో సాధారణంగానే ఈ బీచ్‌కు సందర్శకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దీనికితోడు బెంగాళ్ సీజన్ తోడవ్వడంతో ఆ సంఖ్య మరింతగా పెరిగింది. బీచ్‌కు వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. కొద్ది రోజులుగా వాతావరణం అనుకూలించక నిలిచిపోయిన బోటు షికార్ పునఃప్రారంభమైంది. దీంతో కొందరు బోటు షికార్ చేస్తూ... కెరటాల సవ్వడిపై సందడి చేయగా, మరికొందరు ఇసుక తెన్నెల్లో ఆటలు ఆడుతూ కనిపించారు.

శారదా పీఠానికి కేటాయించిన భూములు వెనక్కి తీసుకోవాలని నిరసన



భూములు వెనక్కి తీసుకోవాలని ప్రదర్శన చేస్తున్న నాయకులు

భీమునిపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శారదా పీఠానికి గత ప్రభుత్వం కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలని ఐక్య వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు శారదా పీఠానికి చెందిన భూములపై జెండాలు పాతారు. అక్కడి నుంచి ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా వేదిక కన్వీనరు బి. వెంకటరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం శారదా పీఠానికి కేటాయించిన భూములను వెనక్కి తీసుకోవాలన్న నిర్ణయం మంచిదని, తాత్సారం చేయకుండా భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక సభ్యులు సుజాత, సుధాకర్, ఓంకార్, రవి, సంతోష్, ఎం. మహేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకుడు వెంకట్రావు

15న రాధాకృష్ణ మహోత్సవాలు

తగరపువలస, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌లో వచ్చేనెల 15న రాధాకృష్ణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు యాదవ సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం వారు సంగివలసలో సమావేశమయ్యారు.నియోజకవర్గంలో యాదవులందర్నీ ఆహ్వానించి, ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో పలు మండలాలకు చెందిన యాదవ సంఘం నాయకులు అక్కరమాని వెంకట్రావు, మొల్లి లక్ష్మణరావు, గుడ్డాల ఎల్లయ్య, అక్కరమాని రామునాయుడు, పల్ల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

98 మందికి హోమియో మందులు పంపిణీ



శిబిరంలో రోగికి పరీక్ష చేస్తున్న వైద్యుడు

భీమునిపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నబజారులో సిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఆదివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 98 మంది రోగలను పరీక్షించి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ కె. శ్రీరామ్, మూర్తి, భానోజీరావు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, శంకర్, రాము పాల్గొన్నారు.

నేటి నుంచి మరిడిమాంబ ఉత్సవాలు

భీమునిపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నాగవంశ కుల దేవత మరిడిమాంబ అమ్మ వారి ఉత్సవాలు సోమవారం నుంచి మూడురోజుల పాటు జరగనున్నాయి. ఈమేరకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఆలయ ఆవరణలో పోస్టర్లు ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాలరావు, సన్యాసినాయుడు, సూరిబాబు, అప్పలనాయుడు, రామానాయుడు, గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల మెడపై 'మెడికల్' కత్తి

- 50 ఏళ్లు దాటిన వారంతా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్న ఉక్కు యాజమాన్యం
- ఎందుకోసమో తెలియక బిక్కుబిక్కుమంటూ పనులు సాగిస్తున్న 3,150 మంది కార్మికులు
- యాజమాన్యం కుట్రలో భాగమేనంటున్న కార్మిక సంఘాలు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలోని కాంట్రాక్టు కార్మికుల మెడపై ఇప్పుడు మరో కత్తి వేలాడుతుంది. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని నిస్సహాయ స్థితిలో కార్మికులు బిక్కుబికుమంటూ పనులు సాగిస్తున్నారు. స్టీల్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న 50 ఏళ్లు పైబడిన కాంట్రాక్టు కార్మికులు 3,150 మంది ఉన్నారు. అయితే వీరందరూ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చెప్పారంటూ వైద్య పరీక్షలు చేసుకోవాలని ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులలో సూచించింది. వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన జాబితాను సైతం విడుదల చేసింది. ప్లాంటులో గల ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వద్ద రక్త పరీక్షలను, ఇతర టెస్టులను ఉక్కుజనరల్ ఆస్పత్రిలో చేయించుకోవాలని సంబంధిత విభాగాల అధికారులు ఆయా కాంట్రాక్టు కార్మికులకు సూచించారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఎందుకు వైద్య పరీక్షలు చేయించుకోమంటున్నారో అంతు చిక్కడం లేదని పలువురు కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.స్టీల్‌ప్లాంటులో సుమారు 4,200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించే క్రమంలోనే ఇదంతా జరుగుతుందని, సుమారు 550 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లకు మళ్లీ టెండర్లను పునరుద్ధరించడం లేదా కొత్తగా టెండర్లను పిలవకపోవడం, తాజాగా యాభై ఏళ్లు నిండిన 3,150 మంది కార్మికులకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించడాన్ని బట్టి చూస్తే ఇదంతా కార్మికులను తొలగించే కుట్రలో భాగమేనని పలువురు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈఎస్‌ఐ లేని వారికి అసౌకర్యాన్ని కల్పించాలని, లేకుంటే గతంలో ఈఎస్ఐకి కేటాయించిన నిధులతో హెల్త్ కార్డులు ఇచ్చి కాంట్రాక్టు కార్మికులకు వైద్య సౌకర్యం కల్పించాలని కార్మిక సంఘాలు కోరినా పట్టించుకోని ఉక్కు యాజమాన్యం ఇప్పుడు మెడికల్ టెస్టులు అంటూ ముందుకు సాగుతుండడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. ప్లాంటులో కొన్ని విభాగాల్లో ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సౌకర్యాలు కల్పించకుండా ఇప్పుడు వైద్య పరీక్షలు చేపడుతుండడాన్ని చూస్తుంటే ఇదంతా ఉద్యోగాల నుంచే తీసివేసే కుట్రలో భాగంగా కనిపిస్తుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ టెస్టులకు సంబంధించి జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోకపోతే ఈ నెల 22న ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా చేస్తామని కార్మిక నాయకులు హెచ్చరించారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు కుట్ర

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను ఎలాగైనా తొలగించాలనే కుట్రతో యాజమాన్యం ముందుకు సాగుతుంది. ఇది మంచి పద్ధతి కాదు. 4,200 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తామని చెప్పినప్పుడు పెద్ద ఎత్తున ఉద్యమం చేయడంతో ఆ చర్యలను ఉక్కు యాజమాన్యం విడనాడింది. కానీ ఏదో ఒక విధంగా కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని చూస్తుంది. ఉక్కు యాజమాన్య కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 22న చేపట్టనున్న భారీ ధర్నాను అందరూ విజయవంతం చేయాలి.

-జి.శ్రీనివాసరావు, సీఐటీయూ
కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షుడు



నగరంపాలెం రోడ్డుకి ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

అనధికార మార్కెట్‌తో ట్రాఫిక్ ఇక్కట్లు

మధురవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నుంచి నగరంపాలెం వెళ్లే రోడ్డుకి ఇరువైపులా అనధికార మార్కెట్ వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. సాధారణ రోజుల కంటే ఆదివారం ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. రహదారికి ఇరువైపులా చేపలు, పండ్లు, కూరగాయలు విక్రయించేవారు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలుదారులు రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాలను నిలిపివేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నగరంపాలెం, మల్లయ్యపాలెం, అయోధ్యనగర్ ప్రాంతాల నుంచి మధురవాడ కూడలికి వాహనాలపై వచ్చేవారు, అటువైపు వెళ్లే వారు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ పోలీసులు దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



కళానగర్‌లో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర సరకుల ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విమర్శించారు. ఆదివారం 7వ వార్డు కళానగర్, కృష్ణానగర్ ప్రాంతాల్లో అధిక ధరలకు నిరసనగా పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కావస్తున్నా.. పప్పులు, బియ్యం, వంట నూనెలు, కూరగాయల ధరలు తగ్గించలేదన్నారు. కేంద్రం అధికంగా పన్నులు వసూలు చేయడం వల్ల నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం చూసీచూడనట్టు ఉండడంతో ఆ భారం ప్రజలు మోయాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధరలకు కళ్లెం వేయకపోతే సామాన్యులు ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. కాగా ర్యాలీలో భాగంగా నాయకులు అధిక ధరలపై కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన



మద్యం దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

మధురవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మిథిలాపురి వుడా కాలనీ సమీపంలో ఉన్న దివ్యాంగుల కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే చోటకు తరలించాలని శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీవాసులు షాపు ఎదుట ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె. నీలకంఠ ప్రసాద్, బి.అనిల్ మాట్లాడుతూ నివాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు మహిళలు కూడా అవస్థలు పడుతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి దుకాణాన్ని నివాస ప్రాంతాలకు దూరంగా తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు సొసైటీల సభ్యులతో పాటు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

వివేకానందనగర్ కాలనీ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం సభ్యులతో కాలనీవాసులు

ఎండాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు వివేకానంద నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. కాలనీలో ఉన్న పార్కులో 80 మంది కాలనీవాసులు సమావేశమై తొమ్మిది మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మధుసూదనరెడ్డి, అధ్యక్షుడిగా అనెత్తెన్న పెద్దిరాజు, ఉపాధ్యక్షుడిగా టీఎస్ నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఆర్. ఉదయ్, జాయింట్ కార్యదర్శులుగా కె. వెంకటేష్, భానుమతి, కోశాధికారిగా మురళీకృష్ణ, ఉప కోశాధికారులుగా కోటేశ్వరరావు, రుక్మిణి ఎన్నికయ్యారు. కాలనీలోని సమస్యల పరిష్కారంతో పాటు పార్కు అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు పేర్కొన్నారు.

అరకొర సిటీ బస్సులతో అవస్థలు



బస్సులో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

తగరపువలస, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిటీ బస్సుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల అవసరాలకు తగినన్ని బస్సులు లేక, సొంత వాహనాలు, కళాశాలల బస్సులు, ఆటోలపై ఆధారపడుతున్నారు. సంగివలస వద్ద ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలు ఉన్నాయి. అలాగే తగరపువలస దాటిన తరువాత అవంతి ఆవరణలో నాలుగు కళాశాలలు, దాకమర్రి వద్ద రఘు, విట్, లెండి కళాశాలలు ఉన్నాయి వీటిలో చదువుతున్న విద్యార్థుల్లో కొంతమంది కళాశాలల బస్సులపై వస్తుండగా, మిగిలిన వారు ఆర్‌టీసీ బస్సుల ఆధారంగా ప్రయాణాలు సాగిస్తున్నారు.ఉదయం వచ్చేటప్పుడు, మధ్యాహ్నం వెళ్లేటప్పుడు కిక్కిరిసిన బస్సుల్లో ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. దీని వల్ల విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చాలామంది బస్సు పాసులు తీసుకున్నా.. సకాలంలో బస్సులు అందుబాటులో లేక ఆటోలపై ఆధారపడాల్సి వస్తోంది. సిటీ బస్సులు తగినన్ని లేక, లైన్ బస్సులపై వెళుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు ట్రిప్పులు నడిపితే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా సత్యసాయి అవతరణ దినోత్సవం

పద్మనాభం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేకంగా రూపొందించిన రథంలో సత్యసాయి చిత్రపటాన్ని నిలిపి ద్విచక్ర వాహనాలతో రథయాత్ర జరిపారు. ఏనుగులపాలెం, మద్ది, పద్మనాభం, అర్చకునిపాలెం, రెడ్డిపల్లి గ్రామాల మీదుగా ఈ యాత్ర సాగింది, రెడ్డిపల్లిలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జోనల్ కోఆర్డినేటర్ సాయి, సత్యనారాయణ, స్థానిక భజన మండలి ప్రతినిధులు రమణ, సన్యాసిరావు, గురునాథరావు పాల్గొన్నారు.

అమరుల త్యాగం... అజరామరం

నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం

- బీచ్‌రోడ్డులో ఘనంగా ఏర్పాట్లు
- పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి



విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అనగానే చాలామందికి జాలి, దయ, కనికరం లేకుండా కఠినంగా ఉంటారనే భావన కలుగుతుంది. కానీ ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకుని తామున్నామనే భరోసా కల్పించే ఆపద్బాంధవులు కూడా పోలీసులే అని కొద్దిమంది మాత్రమే గుర్తిస్తారు. సమాజ శ్రేయస్సే తమ శ్రేయస్సుగా... ప్రజల యోగక్షేమాలే... తమ కుటుంబసభ్యుల యోగక్షేమాలుగా భావించి నిరంతరం విధి నిర్వహణలో మమేకమతారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలను పణంగా పెట్టడానికి వెనుకాడని పోలీసుల త్యాగం అజరామరమనే చెప్పుకోవాలి. అలాంటి వారి సేవలు, అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేందుకు పోలీసులు ఏటా అక్టోబర్ 21న 'అమరవీరుల సంస్మరణ దినం'గా జరుపుకుంటారు. ఈ ఏడాది కూడా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కోసం నగర పోలీస్ కమిషనరేట్ అధికారుల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాట్లు చేశారు.

అమరవీరుల సంస్మరణ దినం నేపథ్యం ఇది

చైనా సరిహద్దు ప్రాంతమైన లడక్ సమీపంలోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో మన కేంద్ర పారా మిలటరీదళం (సీఆర్‌పీఎఫ్) 1959, అక్టోబరు 21న గస్తీ నిర్వహిస్తోంది. సీఆర్పీఎఫ్‌కు చెందిన పదిమంది జవాన్లు తమ సరిహద్దులోకి చొరబడ్డారంటూ చైనా సైనికులు వారిని నిర్బంధించారు. చైనా సైన్యం వారిని అనేక చిత్రహింసలకు గురిచేసి అనంతరం అతికిరాతంగా తుపాకీలతో కాల్చి చంపేసింది. అమరులైన వారి పోరాటాన్ని, స్ఫూర్తిని స్మరించుకుని, అంకితభావంతో విధులు నిర్వర్తించడం కోసం అప్పటి నుంచి ప్రతీ ఏటా అక్టోబరు 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుతున్నారు.

నగర పోలీస్ కమిషనరేట్ విషయానికి వస్తే.. బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద ఏటా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. వారం రోజుల పాటు పరేడ్ రిహార్సల్స్‌తో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. పోలీసులు నిర్వర్తించే విధులు, వినియోగించే ఆయుధాలపై అవగాహన కల్పించడం కోసం ఓపెన్‌హౌస్ పేరుతో ప్రతీ స్టేషన్‌లోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు విజేతలైన వారికి బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా బీచ్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా ఏర్పాట్లు చేశారు. సీపీ శంఖబ్రతబాగ్చి ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. పరేడ్ రిహార్సల్స్‌లో పాల్గొని సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి అమరవీరుల సంస్మరణ దినం వేడుకలు ప్రారంభమవుతాయి. సీపీ శంఖబ్రతబాగ్చి, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టీతో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారుల సమక్షంలో సిబ్బంది పరేడ్ నిర్వహిస్తారు. నగరంతో పాటు జిల్లాకు చెందిన పోలీస్ ఉన్నతాధికారులు, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారు. గడిచిన ఏడాది కాలంలో అమరులైన పోలీసులతో పాటు అంతకు ముందు కూడా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపిస్తారు. వారి త్యాగాల స్ఫూర్తితో విధినిర్వహణలో పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేస్తారు. అమరులైన వారి కుటుంబసభ్యులతో ఉన్నతాధికారులు సమావేశమవుతారు. వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేసి అండగా తామున్నామనే భరోసా కల్పిస్తారు.



తీరంలో రిహార్సల్ పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

అయోడిన్ లోపిస్తే తిప్పలే..



శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాల్లో అయోడిన్ కీలకం

- లోపిస్తే అనేక అనారోగ్య సమస్యలు
- అయోడైజ్డ్ ఉప్పు వినియోగంతో సమస్యలకు చెక్
- నేడు ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం

అయోడిన్.. శరీరానికి అవసరమైన సూక్ష్మ పోషకాల్లో ముఖ్యమైనది. అయోడిన్ లోపిస్తే అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. రోజు వారీ తీసుకునే ఆహారంలో అయోడిన్ ఉండాలి. ముఖ్యంగా హార్మోన్ల ఉత్పత్తికి కీలకం. అయోడిన్ పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి వంద మందిలో 20 మంది అయోడిన్ లోపంతో బాధపడుతున్నట్టు పలు పరిశోధనల్లో వెల్లడైంది. అయోడిన్ లోపం వల్ల కలిగే వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించే ఉద్దేశంతో ఏటా అక్టోబరు 21న ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినం నిర్వహిస్తున్నారు.

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శరీరంలో జీవ క్రియలు సక్రమంగా జరగాలంటే సూక్ష్మ పోషకాలకు చెందిన అయోడిన్ వంటి మూలకాలు అవసరం. గొంతు వద్ద ఉండే థైరాయిడ్ గ్రంధి తీసుకున్న ఆహారం ముడి ఆర్గానిక్ రసాయన అణువులను నాలుగు అయోడిన్ పరమాణు వులుగా గ్రహించి థైరాక్సిన్ హార్మోన్ తయారుచేస్తుంది. అయోడిన్ శరీరానికి అందకపోతే థైరాక్సిన్ తయారు కాదు. దీని ఉత్పత్తి లోపిస్తే అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా గాయిటర్. మెడకు కుడి, ఎడమ వైపుల వాపు. దీంతో పాటు మెదడు ఎదుగుదల లేకపోవడం, జ్ఞాపకశక్తి కేంద్రీకరించలేకపోవడం, క్రిటి నిజమ్, కండరాలు బలంగా మారడం, వినికిడి లోపం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, చిరాకు, హుషారు లేకపోవడం వంటి రుగ్మతలు వేధిస్తాయి. గర్భిణులు తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపిస్తే శిశువుల్లో అసాధారణ లోపాలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గర్భస్రావం, మృత శిశు జననాలకు, పిల్లలు పుట్టకపోవడం వంటి సమస్యలకు అవకాశం ఉంది.

గాయిటర్‌తో జాగ్రత్త

రోజు వారీ తీసుకునే ఆహారంలో తగినంత అయోడిన్ లేకపోతే గాయిటర్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. ఈమేరకు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ 1952 నుంచి ఇంటర్నేషనల్ గాయిటర్ కంట్రోల్ ప్రొగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో ఏటా అయోడిన్ లోపవ్యాధుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. దేశంలోని ప్రజలకు అయోడిన్ లోపాన్ని తగ్గించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆహార పదార్థాల్లో అయోడైజ్డ్ ఉప్పునే వాడాలంటూ 2005లో చట్టం చేసింది.



అయోడిన్ లభించే పదార్థాలు

అయోడిన్ అతి కొద్ది వాటిల్లో మాత్రమే లభిస్తుంది. మట్టి, సముద్రం, చేపలు, నాచు, సముద్రంలోని కలుపు మొక్కల్లో ఉంటుంది. గుడ్డు, పాలు, చెర్రీ, బనానా, దుంపల్లోనూ లభిస్తుంది. మట్టిలో రసాయనాల వినియోగం, అడవులు అంతరించిపోవడం, భారీ వర్షాలు వల్ల మట్టిలో ఉన్న అయోడిన్ పూర్తిగా తగ్గిపోతోంది. కొండ ప్రాంతాల్లో ఉండే గిరిజనుల్లో అయోడిన్ లోపం అధికం. దీనికి కారణం కొండవాలు ప్రాంతాల్లోని మట్టి వర్షాలకు కింద ప్రాంతాలకు వెళ్లడమేనని నిపుణులు చెబుతున్నారు.

ఉప్పులో అయోడిన్ కలిపి..

అయోడిన్ లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించింది. అయోడిన్‌ను అన్ని వర్గాల ప్రజలకు అందించేందుకు తక్కువ ధరకు లభించే ఉప్పును వాహకంగా వాడాలని నిర్ణయించింది. ఉప్పులో అయోడిన్‌ను కలిపి అందేలా చేస్తున్నారు. తక్కువ ధరకే అయోడైజ్డ్ ఉప్పు విక్రయించాలన్న నిబంధన ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటి లయ

సింహాచలం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని సినీ హీరోయిన్ లయ ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ పర్యవేక్షణాధికారి జీవీ వీఎస్‌కే ప్రసాద్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న లయ గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలను, అధికారులు ప్రసాదాలను అందజేశారు.



శిఖర దర్శనం చేసుకుంటున్న లయ

నేడు మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్ మేళాలో శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ ఇన్నోసోర్స్ ఎస్‌బీఐ కార్డ్, డీమార్ట్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. విశాఖలో పని చేయాల్సి ఉంటుందని, ఎంపికైన వారికి రూ. 20 వేలు నుంచి రూ. 30 వేలు వరకు వేతనం ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966965502 సెల్ నంబర్‌ను సంప్రతించాలని ఆయన సూచించారు.

జూకు సందర్శకుల తాకిడి

ఆరిలోవ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలకు ఆదివారం సందర్శకులు పెద్ద సంఖ్యలు విచ్చేశారు. సెలవు రోజు కావడంతో సుమారు 3,450 మంది జూకు తరలివచ్చారు. వీరి నుంచి సుమారు రూ.2,74,430 ఆదాయం సమకూరినట్టు జూపార్కు ఇన్‌చార్జి క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

గద్దర్ గళంతో జనజాగృతం : ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా గాయకుడు గద్దర్ తన గళంతో జనజాగృతం చేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం, బహుజన కళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏయూలోని టీఎల్ఎన్ సభా హాలులో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతం చేయడంలో గద్దర్ వంటి వ్యక్తులు కీలంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ జెర్రా అప్పారావు, దూర విద్యాకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయమోహన్, ప్రొఫెసర్ జాలాది రవి, బీసీసీ అధ్యక్షుడు షారోన్ రాజ్, ప్రొఫెసర్ ప్రేమానందం, ప్రొఫెసర్ సత్యనారాయణతో పాటు ప్రొఫెసర్ బసవయ్య, ప్రొఫెసర్ ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

ప్రభుత్వాలను గడగడలాడించిన గద్దర్ పాటలు

సీతంపేట : తన పాటలతో గద్దర్ ప్రభుత్వాలనే గడగడలాడించారని ఆయన కుమార్తె వెన్నెల పేర్కొన్నారు. పౌరగ్రంథాలయంలో గద్దర్ అన్న యాదిలో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్యుల కోసం పాటలు రాస్తూ పాట కోసమే గద్దర్ బతికారన్నారు. ఆయన రాసిన పాటలు అనేక ఉద్యమాలకు ఊపిరి పోశాయన్నారు. కార్యక్రమంలో కళాకారులు ఆటపాటలతో ఆహ్లాదం పంచారు.

కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు అవార్డులు

విశాఖపట్నం, అక్టోబరు 20 : బ్యాంకింగ్ ఫ్రంటీరియర్స్ అవార్డుల ఉత్సవంలో కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు మూడు విభాగాల్లో ఉత్తమ అవార్డులు లభించినట్టు బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు తెలిపారు. ఇటీవల లక్నోలో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో బ్యాంకు అధికారులు వీరేంద్రప్రసాద్, సాయిచరణ్‌లు అవార్డులు అందుకున్నారు. సైబర్ సెక్యూరిటీ, క్రెడిట్ ఇనీషియేషన్, వార్షిక రిపోర్టు విభాగాల్లో ఉత్తమ అవార్డులు లభించాయి. పాలకవర్గం, సిబ్బంది కృషితో ఇది సాధ్యమైందని ఛైర్మన్ ఆనందం వ్యక్తం చేశారు. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 32 శాఖలతో ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో విశాఖ నగరంలోని మెయిన్ రోడ్డులో నూతన శాఖతో పాటు మరిన్ని శాఖలను ప్రారంభించనున్నట్టు బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్యామ్‌కిశోర్ తెలిపారు.



అవార్డులు అందుకుంటున్న బ్యాంకు అధికారులు

బృందగాన పోటీల్లో విశాఖ విద్యార్థుల ప్రతిభ

కొవ్వూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బృందగాన పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కొవ్వూరు పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో డాక్టర్ రమేష్ యల్లాప్రగడ అధ్యక్షతన భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో హిందీ, సంస్కృత విభాగాల్లో 8 బృందాలు, తెలుగు, జానపద విభాగాల్లో 9 బృందాలు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి డీఏవీ స్కూల్ (అనకాపల్లి), ద్వితీయ బహుమతి విశాఖ వ్యాలీ (విశాఖపట్నం), తృతీయ బహుమతి శ్రీప్రకాష్ విద్యానికేతన్ (పాయకరావుపేట), మోటివేషన్ బహుమతి డీవీఏ పాఠశాల కొవ్వూరు బృందా లకు లభించాయి. ప్రథమస్థానంలో నిలిచిన డీఏవీ స్కూల్ అనకాపల్లి బృందం సౌత్ విభాగం హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహామహోపాధ్యాయ, సంస్కృతాంధ్ర పండితుడు ఆచార్య దోర్బల ప్రభాకరశర్మ, విశాఖ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరాజు, జీబీవీ సుబ్రహ్మణ్యం, తాడేజు సాయికృష్ణ, పురుషోత్తమ శాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, బి.సుబ్బారావు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తులతో పోటీలో పాల్గొన్న విద్యార్థులు

స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో విశాఖకు పతకాలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి బాలురు, బాలికల స్కేటింగ్ టోర్నీలో విశాఖ స్కేటర్లు పతకాలు సాధించారు. కాకినాడలో ఆదివారం జరిగిన ఈ టోర్నీలో విశాఖ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు 20 పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిలో స్వర్ణ పతకాలు సాధించిన పది మంది ఎస్‌జీఎఫ్ జాతీయ టోర్నీలో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.దేవుడు తెలిపారు. బాలికల అండర్-11 కేటగిరీలో షేక్ అమీనా, డి.ప్రియ, సీహెచ్.చార్వి, అండర్-17 విభాగంలో విద్య ప్రజాపతి, శ్రీకీర్తి ఐశ్వర్య, మల్లారెడ్డి; బాలుర అండర్-17 విభాగంలో పి.జాన్సన్, లోహిత్ సాయి, బి.శశాంక్, అండర్-11 కేటగిరిలో జై చంద్రన్ స్వర్ణ పతకాలు సాధించి జాతీయ టోర్నీకి ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ముగిసిన న్యూరో సర్జన్ల సదస్సు

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూరాలజీ ఆధ్వర్యంలో నగరంలో గత ఐదు రోజులు నుంచి జరుగుతున్న న్యూరాలజీ వైద్యులు జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. చివరి రోజు బీచ్ రోడ్డులో రన్ ఫర్ ది బ్రెయిన్ పేరుతో ఐదు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రారంభించారు. 300 మంది పాల్గొన్నారు. అనంతరం సదస్సు జరుగుతున్న నోవాటెల్‌లో ఆరు హాల్స్‌లో బ్రేక్ ఫాస్ట్ సెషన్స్ నిర్వహించారు. ప్రొఫెసర్ అశోక్ పనగారియా అవార్డు సెషన్‌లో బెంగళూరు నిమ్ హాన్స్‌కు చెందిన డాక్టర్ రోహన్ ఆర్ మహలే మాట్లాడారు. న్యూరో రెహబ్ అవార్డు ప్రసంగాన్ని పాండిచ్చేరికి చెందిన డాక్టర్ సునీల్ కె. నారాయణ్ ఇచ్చారు. అనంతరం వచ్చే ఏడాదికి గాను అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ముంబయి కెమ్ ఆస్పత్రికి చెందిన వైద్యులు సంగీత రావత్‌కు ప్రస్తుత ప్రెసిడెంట్ డాక్టర్ దేబాశిష్ చౌదరి బాధ్యతలు అప్పగించారు. వచ్చే ఏడాది సదస్సు వారణాసిలో జరగనుంది. ముగింపు కార్యక్రమంలో సెక్రటరీ డాక్టర్ యూ. మీనాక్షి సుందరం, ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ జి. బుచ్చిరాజు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గోపి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ సుష్మ, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వైద్యులు

క్రైం... crime news

భర్త కళ్లెదుటే అనంత లోకాలకు..

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ - మహిళ దుర్మరణం

సీతంపేట, అక్టోబరు 20: (ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి ద్విచక్రవాహనంపై బయలుదేరిన దంపతులను లారీ ఢీకొనడంతో భర్త కళ్లెదుటే భార్య విగతజీవిగా మారింది. కంచరపాలెం బర్మాకాలనీకి చెందిన రావాడ ఈశ్వరరావు, రావాడ సంతోషి (36) ఎండాడలో శుభ కార్యక్రమానికి ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరారు. జాతీయ రహదారి మీదుగా వస్తున్న వీరిని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో ఈశ్వరరావు ఒకవైపు పడిపోయాడు. సంతోషి మరో వైపు పడిపోయింది. లారీ చక్రాలు ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో ఈశ్వరరావు గుండెపగిలేలా రోదించారు. ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, ఎస్ఐ వాణిశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. సంతోషి మృతి సమాచారంతో బర్మాకాలనీ విషాదంలో మునిగింది. ఈ దంపతులకు కుమార్తె ఝాన్సీ కుమారుడు దిలీప్ ఉన్నారు. తండ్రి లారీ డ్రైవర్. తల్లిని కోల్పోయిన పిల్లలను ఓదార్చడం ఎవరికీ సాధ్యం కాలేదు.



సంతోషి (ఫైల్‌ఫొటో)

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

వెంకోజీపాలెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటన ఇసుకతోట సిగ్నల్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. దొండపర్తికి చెందిన అజయ్ ఎంవీపీ డబుల్ రోడ్డు నుంచి బైక్‌పై సిగ్నల్ వద్ద వేచి ఉన్నాడు. అదే సమయంలో వెంకోజీపాలెం నుంచి వస్తున్న రేసపువానిపాలేనికి చెందిన ఇద్దరు యువకులు రాంగ్ రూట్‌లో అతి వేగంతో వచ్చి ఆగి ఉన్న అజయ్ వాహనాన్ని బలంగా ఢీకొన్నారు. దీంతో యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. టాఫిక్ కానిస్టేబుల్ క్షతగాత్రులకు సపర్యలు చేసి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. గాయపడిన తమ వారిని ఆసుపత్రికి తరలించారు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పబ్‌లు, బార్‌లలో పోలీసుల తనిఖీ

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పబ్‌లు, బార్‌లలో పోలీసులు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నగరంలోని నాలుగు పబ్‌లు, బార్‌లలో తనిఖీలు చేపట్టారు. ఆయా పబ్‌లు, బార్‌లకు అగ్నిమాపక శాఖ అనుమతులు, ట్రేడ్ లైసెన్సు, పార్కింగ్, సీసీ కెమెరాల ఫుటేజీల స్టోరేజీ, మైనర్లకు ప్రవేశం, ఎక్సైజ్ శాఖ అనుమతులను పరిశీలించారు. ఒక బార్/పబ్‌కు ఫైర్ ఎన్‌ఓసీ, మరో బార్‌కు జీవీఎంసీ ట్రేడ్ లైసెన్స్ లేదని గుర్తించారు. వారిపై చర్యలకు కోసం ఆయా శాఖల అధికారులకు నివేదిక పంపించారు.

విద్యా రంగ పరిరక్షణ బాధ్యత ఉపాధ్యాయులదే

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

డాబాగార్డెన్స్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధీనంలో విద్య ఉండటం ద్వారానే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులు నిలబెట్టుకోగలమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రభుత్వరంగ బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి పోరాడిందన్నారు. పాలకవర్గాల విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీన పడిందన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహనరావు మాట్లాడుతూ యూటీఎఫ్ స్థాపనలో జీవితాలను పణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ భవిష్యత్ ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ అన్ని యాజమాన్య ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ అగ్రభాగాన ఉందన్నారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి టి.ఆర్. అంబేద్కర్, పైడిరాజు, ఎన్.ప్రభాకర్, ఆర్.ఉమాదేవి, కె.రాంబాబు, సి.సత్యం, రాము, రిజ్వాన్, అహ్మద్, జగన్, రామలక్ష్మి, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.